RNI No. TELTEL . 12/48343

# మహానది

MAHANADI TELUGU DAILY

Website: www.mahanadi.net

రంగారెడ్డి | సంపుటి : 4 | సంచిక : 222 | ఎడిటర్ : మామిడి సోమయ్య | బుధవారం | అక్టోబర్ | 29 | 2025 | పేజీలు : 8 | వెల : రూ.2.00


## ఢిల్లీ ఎయిర్‌పోర్టులో భారీ అగ్ని ప్రమాదం..

హైదరాబాద్,అక్టోబర్,28:ఢిల్లీ లోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం లోని టెర్మినల్-2 వద్ద మం గళవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఎయిరిండియా ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కుచెందిన షటిల్ బస్సు బేనంబర్-32 సమీపంలో ఎయిరిండియా ఫ్లైట్ వద్ద పార్క్ చేశారు. అయితే, ఉన్నట్టుండి అదే బస్సులో భారీగా మంటలు ఎగసిపడ్డాయి. అయితే, ప్రమాద సమయంలో బస్సులో ప్రయాణికులెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



## శంకర్‌మఠ్‌లో సీయం రేవంత్ ప్రత్యేక పూజలు..

**హైదరాబాద్,అక్టోబర్,28:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినగరంలోని నల్లకుంటలోఉన్నశంకర్‌మఠ్ కు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన గణపతి,శారదాంబ, చంద్రమౌళీశ్వర స్వామి, ఆదిశంకరాచార్యుల ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మంత్రి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కూడా ఉన్నారు. అయితే, 'ధర్మ విజయ యాత్ర'లో భాగంగా శృంగేరి జగద్గురువులు విధుశేఖర భారతీ స్వామి నగరంలోని శంకర్‌మఠ్‌కు వచ్చారు. విషయం తెలుసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా శంకర్‌మఠ్‌కు వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని దివ్య ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా సంద ర్భంగా సీఎం వేములవాడ ఆలయ అభివృద్ధి వివరాలను విధుశేఖర భారతీ స్వామి వారికి సమగ్రంగా వివరించారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక: మంత్రులకు రేవంత్

# బిగ్ టాస్క్..



**హైదరాబాద్,అక్టోబర్,28:**ముఖ్యమంత్రి రేవంత్ కీలక నిర్ణయం తీసుకున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో గెలుపు ఇప్పుడు కాంగ్రెస్ కు ప్రతిష్ఠాత్మకంగా మారింది. సీటు నిలబెట్టుకొనేందుకు బీఆర్ఎస్ కొత్త వ్యూహాలను అమలు చేస్తోంది. అటు బీజేపీ నేతలు నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తున్నారు. ఈ ఎన్నిక వేళ సర్వే నివేదికలతో రేవంత్ తానే ప్రచారంలోకి దిగాలని డిసైడ్ అయ్యారు. కాగా.. మంత్రులకు కీలక బాధ్యతలు అప్పగించారు. బిగ్ టాస్క్ ఫిక్స్ చేసారు. ఈ నిర్ణయం ఇప్పుడు సంచలనంగా మారింది. జూబ్లీహిల్స్ లో ఇప్పుడు పోరు హోరా హోరీగా మారుతోంది. మూడు ప్రధాన పార్టీలు గెలుపు పైన ఫోకస్ చేసాయి. ఎప్పటికప్పుడు గ్రౌండ్ రిపోర్ట్స్ తెప్పించుకుంటూ.. అవసరమైన మార్పులను చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాయి. తాజాగా సీఎం రేవంత్. కాంగ్రెస్ పార్టీ నేతలతో జూబ్లీహిల్స్ బై పోల్ పైన కీలకభేటీ నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి పొరపాటు లేకుండా ప్రతీ డివిజన్.. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రచారం చేసే విధంగా మంత్రులను రంగంలోకిదించారు. ఈ మేరకు డివిజన్ల వారీగా మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. ఒక్కో డివిజన్ కు ఇద్దరు మంత్రులను బాధ్యులను చేసారు. అందులో భాగంగా యూసఫ్ గూడా కు ఉత్తమ్, పొన్నంకు బాధ్యతలు కేటాయించారు.



## తుమ్మిడిహెట్టి-సుందిళ్ల అనుసంధానం

### మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,అక్టోబర్,28:** ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టు పునరుద్ధరణలో భాగంగా తుమ్మిడిహెట్టి నుంచి సుందిళ్ల బరాజ్‌కు నీటిని తరలించాలనే ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్‌ను ఖరారు చేసే అంశంపై త్వరలో రాష్ట్ర ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. తక్కువ వ్యయం, సాంకేతిక సుస్థిరత, పర్యావరణ అనుకూల మార్గాలపై ఇప్పటికే అధ్యయనం జరపగా, తుమ్మిడిహెట్టి-సుందిళ్ల బరాజ్ అనుసంధానం అత్యుత్తమ ప్రత్యామ్నాయంగా తేలిందన్నారు. దీంతో ప్రాజెక్టు నిర్మాణ ఖర్చు 10-12 శాతం తగ్గడంతోపాటు భూసేకరణ వ్యయం సగానికి తగ్గి చివరకు రూ. 1,500%-%1,600 కోట్ల భారం తగ్గుతుందన్నారు.

## సిద్ధరామయ్య ప్రభుత్వానికి

# షాక్ ఇచ్చిన కర్ణాటక హైకోర్టు..!






**బెంగళూరు,అక్టోబర్,28:** కర్ణాటకలోని సిద్ధరామయ్య ప్రభుత్వానికి హైకోర్టు షాక్ ఇచ్చింది. ఇటీవల కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రభుత్వ ప్రాంగణాల్లో ప్రైవేట్ సంస్థలు కార్యక్రమాలు నిర్వహించడానికి ముందస్తు అనుమతి పొందాలని ఒకఉత్తర్వు జారీ చేసింది. ఈ ప్రభుత్వ ఉత్తర్వును సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై కోర్టు విచారిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుపై స్టే విధించింది. తాజా హైకోర్టు నిర్ణయం కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద దెబ్బగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకలాపాలను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం ఈ ఉత్తర్వును జారీ చేసిందని హైకోర్టు అభివర్ణించింది. ప్రభుత్వ ఆదేశాన్ని సవాలు చేస్తూ పునస్చైతన్య సేవా సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌లో.. ఈ చర్య ప్రైవేట్ సంస్థల చట్టబద్ధమైన కార్యకలాపాలను నిర్వహించే హక్కులను ఉల్లంఘిస్తుందని పిటిషన్ తరుపు న్యాయవాదులు వాదించారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికలకు సిద్ధమైన..

# 407 పోలింగ్ బూత్‌లు

**హైదరాబాద్,అక్టోబర్,28:**హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 127 పోలింగ్ స్టేషన్ల లో 407 పోలింగ్ బూత్ లు ఏర్పాటు చేశామని అధికారులు వెల్లడించారు. ఒక్కోపోలింగ్ బూత్ కి నాలుగు చొప్పున1,628 బ్యాలెట్ యూనిట్లు సిద్ధం చేశారు పోలింగ్ అధికారులు. అదనంగా 20శాతం బ్యాలెట్ యూనిట్లను సిద్ధంగా పెట్టుకున్నామని అధికారులు స్పష్టం చేశారు. 509 కంట్రోల్ యూనిట్లు, 509 వీవీ ప్యాట్లు సిద్ధం చేశామని%ూ%ఇప్పటికే ఈవిఎంల ర్యాండమైజేషన్ పూర్తయిపోయిందని అధికారులు వెల్లడించారు.





## నిర్వాసిత రైతులకు ఎకరాకు రూ. 25 లక్షలు ఇవ్వాలి: కవిత

జడ్చర్ల, అక్టోబర్ 28: ఉదండాపూర్ నిర్వాసిత రైతులకు ఎకరాకు రూ. 25లక్షలు ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన ఉదండాపూర్ రిజర్వాయర్ ను మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఉదండాపూర్ నిర్వాసిత రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కవిత పాల్గొని మాట్లాడారు. భూ నిర్వాసితులకు ఏ రోజు ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుందో ఆనాటి రేటు కట్టి ఇవ్వాలని చెప్పారు. 2021 నాటికే కటాఫ్ పెట్టటం సరికాదని.. పరిహారం ఇచ్చే నాటికి 18 ఏళ్లు నిండిన వారందరికీ ఇవ్వాల్సిందేనని అన్నారు. తప్పు బీఆర్ఎస్ చేసిందా? కాంగ్రెస్ చేసిందా? అని కాదని.. ఇక్కడ ప్రజలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు మంచి జరగాలని మాత్రమే తాను ఆలోచిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయని.. మిగతా పనులు ఈ ప్రభుత్వం చేస్తుందా? లేదా? చెప్పాలని ప్రశ్నించారు. జనంబాటలో భాగంగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులోభాగమైన ఉదండాపూర్ రిజ ర్వాయర్‌నిర్వాసితులతో మాట్లాడారు. తెలంగాణ రాకముం దు మహబూబ్ నగర్‌లో నీళ్ల కరువు ఎలా ఉండేదో అందరికీ తెలుసని చెప్పారు. వందల ఎకరాలు ఉన్న వారు కూడా నీళ్లు లేక వలస పోయారని ఆనాటి రోజులను గుర్తు చేశారు.తెలం గాణ రాష్ట్రం ఏర్పడ్డాక కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాక తీయ ద్వారానీటి సమస్యలను అధిగమించా మని చెప్పారు. కృష్ణా నది నీళ్లను వినియోగించుకోవాలని పాల మూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్ ను కేసీఆర్ చేపట్టారని తెలిపారు.

## మొంథా ఎఫెక్ట్.. చెన్నైలో భారీ వర్షం..

# నీటమునిగిన లోతట్టు ప్రాంతాలు



**చెన్నై,అక్టోబర్,28:**ప్రభావంతో దేశంలోని పలు రాష్ట్రాల్లో భారీ .వర్షా లు కురుస్తున్నాయి. ఏపీ, ఒడిశా, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో వానలు పడుతున్నాయి. తాజాగా తమి ళనాడు రాజధాని చెన్నై లో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ నీటముని గాయి. ప్రధాన రహదారులు నదులను తలపిస్తున్నాయి. రోడ్లపై భారీగా వర్షపు నీరు నిలవడనంతో ట్రాఫిక్ స్తంభించింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెన్నైలో ఈరోజు మధ్యాహ్నం 1 గంటల వరకు ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని ప్రాంతీయ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. చెన్నైతోపాటూ చెంగల్పట్టు, కాంచీపురం, రాణిపేట, తిరువళ్లూరు సహా పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది.



### మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధం..

## ముగ్గురు మృతి

### జైపూర్-ఢిల్లీ జాతీయ రహదారిపై ఘటన

**న్యూఢిల్లీ,అక్టోబర్,28:** కర్నూలులో ఘోర బస్సు ప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 19 మంది సజీవదహనమయ్యారు. ఈ ఘటన మరవకముందే దేశంలో మరో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదానికి గురైంది. రాజస్థాన్‌లో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైంది ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. పలువురు గాయపడ్డారు.

# కబ్జాల చెర వీడిన 1.27 ఎకరాల పార్కు.. హైడ్రా విముక్తి

హైదరాబాద్,అక్టోబర్ 28: అక్రమ కట్టడాలు కూల్చేవేతే ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రా..ఆ దిశగా దూసుకుపోతుంది. మంగళవారం నగరంలో వేర్వేరు చోట్లఆక్రమణల తొలగించింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఆయన ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారు. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం కర్మన్‌ఘాట్ విలేజ్‌లోని హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో 1.27ఎకరాల పార్కు కబ్జా చేశారంటూ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా.. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పరిశీలించింది. పార్కు స్థలాన్ని లేఔట్‌లో చూపించి తర్వాత ప్లాట్లుగా విక్రయిస్తున్నారని గ్రహించి ఆక్రమణలను హైడ్రా తొలగించింది. చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా కాపాడినట్టు పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది.శేరిలింగంపల్లి జోన్ చందానగర్ సర్కిల్ పరిధిలోని గంగారాం కాలనీలో సుభాష్‌నగర్ పేరిట 1974లో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ చెందినవారు లే ఔట్ వేశారు. ఇందులో 700 గజాల స్థలాన్ని ప్రజావస రాలకు కేటాయించారు. పేదల అవసరాల కోసం కేటాయించబడిన ఈ లే ఔట్‌లో బడాబాబు పాగా వేశారు. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాన్నిప్లాట్లుగా మార్చాడు.





## తీరానికి చేరువవుతున్న మొంథా.. రైల్వే శాఖ అప్రమత్తం

**న్యూఢిల్లీ,అక్టోబర్,28:**'మొంథా' తుఫాను ముంచుకొస్తుండటంతో భారత రైల్వే శాఖ అప్రమత్తమైంది. తక్షణ చర్యలు చేపట్టేందుకు వీలుగా తెలుగు రాష్ట్రాల్లో, ఒడిశాలో డివిజనల్ వార్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని రైల్వే శాఖ మంత్రిఅశ్వినీ వైష్ణవ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలైన దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైల్వే శాఖ సర్వసన్నద్ధంగా ఉండాలని సూచించారు. ప్రత్యేకించి విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం డివిజన్ల పరిధిలో అవసరమైన యంత్రాలు, సామగ్రితోపాటు సిబ్బందిని తక్షణమే అందుబాటులో ఉంచాలన్నారు.

# పేదల బియ్యం పెడదారి
# -గుట్టుచప్పుడు కాకుండా అక్రమ దందా



బయ్యారం,మహనది న్యూస్,అక్టోబర్ 29: అన్నం వండుకునేందుకు పావుషేరు బియ్యం లేక పేదలు నానా బాధలు పడుతుంటే, పేదలకు ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యాన్ని కొంతమంది మిల్లర్లు,వ్యాపారులు గద్దల్లా తన్నుకుపోతున్నారని, నిరుపేదల కడుపులుకొట్టి పేదల బియ్యాన్ని దొంగచాటుగా తరలించుకుపోయి వాటిని కొత్తగా పాలిష్ పట్టించి కొత్త బ్రాండ్లతో అమ్ముకుంటూ కోట్లు సంపాదించుకుంటున్నారు. గొలుసుకట్టుగా ఒకరినుంచి మరొకరు ఈ అక్రమాలకు పాల్పడు తున్నారు.మండల వ్యాప్తంగా ఈ అవినీతి అక్రమార్కుల దందా చాలా కాలం నుండి కొనసాగిపోతూనే ఉంది.గతకొంతకాలంగాఅవినీతి అక్రమాలతోఎంతోమంది మిల్లర్లు, వ్యాపారులు కోట్లాదిరూపాయలు ఆర్జిస్తూ.. ప్రభుత్వం కళ్ళుకప్పుతూనే ఉన్నారు.. పేదల బియ్యాన్ని దోచుకుని కోట్లు కూడగట్టుకుంటూనే ఉన్నారు. గత ప్రభుత్వం హయాంలో సాఫీగా సాగిపోయిన ఈ అక్రమార్కుల దందా నేటికీ జోరుగానే సాగుతోందని విమర్శలు వస్తున్నాయి. కొత్త ప్రభుత్వం వచ్చాకనైనా ఈ అవినీతి అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని, మొత్తంగా ఈ ప్రక్రియ రూపురేఖలన్నీ మార్చి.. నిజమైన లబ్దిదారులకు, పేదలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చూడాలని సామాన్య ప్రజలు.. పేదలు కోరుకుంటున్నారు. పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం డీలర్ల నుంచి దళారులకు, దళా రుల నుంచి మిల్లర్లకు వెళ్ళిపోయి.. చివరికి పెద్దపెద్ద వ్యాపారుల జేబులు నింపుతోంది. రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తూ ఏటా అక్రమార్కులు కోట్లాదిరూపాయలు దోచేసుకుంటున్నారు. ఈ దశల్లో ఎక్కడా కూడా ప్రభుత్వం విధించిన నియమనిబంధనలను పాటించేవారు ఉండరు. అయినా అలాంటి అక్రమార్కుల కొమ్ముకాస్తూ కొంతమంది సైతం అవినీతికి తెరతీస్తుండడంతో ఆ పెద్దల అక్రమార్జనకు వీరు కూడా దారులు తీసినట్లవుతోందని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు చేరాల్సిన బియ్యాన్ని దొడ్డిదారిన మిల్లులకు చేర్చి, అక్కడ వాటికి మళ్ళీ పాలిష్‌పెట్టించి రకరకాల బ్రాండ్ల పేరుతో మార్కెట్లోకి తీసుకొచ్చి అమ్ముకుంటూ ప్రభుత్వానికి కుచ్చుటోపీ పెట్టేస్తున్నారు. అడిగేవారెవరూ లేకపోవడంతో ఇవే బియ్యాన్ని మరికొందరు ఇతర ప్రాంతాలకు కూడా అమ్మేసు కుంటూ కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారనే వాదన వినిపిస్తోంది.ధనాశాపరులైన కొంతమంది అవినీతిదారుల అండదండలతో జరుగుతున్న ఈ అక్రమ వ్యాపారం నేటికీ జోరుగా సాగుతూనే ఉందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పేదలకు ప్రభుత్వం పంపిన రేషన్ బియ్యాన్ని సేకరించి,దాచిపెట్టి నిల్వలు పేర్చు కుని, ఆ తర్వాత సందుచూసుకుని పాలిష్ పెట్టించి వాటిని కొత్తసంచుల్లో కొత్త బ్రాండ్ల పేరుతో ఎక్కువ ధరలకు అమ్మేసు కుంటుండడం కొంతమందికి వెన్నతో పెట్టిన విద్య. ఏళ్ళ తరబడి ఈ దందా ఇలా సాగుతున్నా పట్టించుకునే నాధులు లేకపోవడంతో అక్రమార్కులు ప్రభుత్వ లక్ష్యాన్ని నీరుగారుస్తూ, పేదల బియ్యం దోచుకుంటూ అక్రమంగా కోట్లాది రూపాయలు ఆర్జిస్తున్నారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎప్పటికప్పుడు కేసులు నమోదు చేసి అక్రమ నిల్వలను, పిడిఎఫ్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్నారు. అయినా రేషన్ మాఫియా ఆగడాలకు హద్దు అదుపు లేకుండా పోతుంది. ఉన్నతాధికారులు ఇకనైనా ఈ అక్రమార్కులపై కొరడా ఝుళిపించకుంటే ఈ అక్రమాలకు ఇక అడ్డూ అదుపూ ఉండనే ఉండదని ప్రజలు భావిస్తున్నారు.కొందరు రేషన్ డీలర్లు బియ్యం కి బదులు లబ్ధిదారుల వేలిముద్రలు వేయించుకుని కిలోకి ఏడు రూపాయల చొప్పున చెల్లిస్తున్నారని,అసలు డీలర్లు లబ్ధిదారులకు డబ్బులు ఎందుకు ఇస్తున్నారు?ఆ డబ్బులతో కొన్న బియ్యాన్ని ఏమి చెయ్యడానికి ప్రయత్నిస్తున్నారు..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.బియ్యం షాప్ కి వస్తే గతంలో సాటింపు చేసి మరీ అందరికి తెలియజేసేవారు.అప్పుడు అంత విలువ వుండే రేషన్ బియ్యానికి,ఇప్పుడు ఎప్పుడు వస్తున్నాయో ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి. అసలు పేద వారి కోసం ప్రభుత్వాలు



బియ్యం పంపిణీ చేస్తుంటే అవి కూడా వారికి అవసరం లేదన్నట్టు ఎందుకు అమ్ముకుంటున్నారని కొందరు ప్రశ్నిస్తున్నారు.అమ్ముకునే బదులు రేషన్ బియ్యం మాకు అవసరం లేదని కార్డులను రద్దు చేసుకుంటే ఉత్తమం అప్పుడైనా నిజమైన పేదవారు లబ్ధిపొందుతారు కదా%ా%ప్రభుత్వాలు రేషన్ బియ్యం కోసం కొన్ని కోట్ల ప్రజాధనం ని వెచ్చించి సరఫరా చేస్తుంది.ప్రభుత్వం అంటే అదేదో కాదు మనమే %ా%.మనం కట్టే పన్నుల ద్వారా వచ్చే పైకంలో కొంత బియ్యం కోసం కేటాయిస్తుంది.మనం పన్నులు కట్టి ప్రభుత్వానికి పని చెప్పి మళ్ళీ వాటిని దళారులకు అమ్మి వాళ్ళని బాగుచేసి రెండు వైపులా నష్టపోయేది ప్రజలు మాత్రమే అనే విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలి.ప్రభుత్వాలను నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని డిమాండ్ చెయ్యాలి. వాటిని సక్రమంగా వాడుకుంటే ఆ పథకం కి సార్ధకత ఉంటుంది. ముందు మనం మారాలి,ఇప్పటికైనా పిడియఫ్ బియ్యం పక్కదారి పట్టకుండా భాద్యతాయుతమైన బాధ్యత ప్రతి పౌరుడికి ఉంది. దానికి తోడు అక్రమాలు జరగకుండా చూసుకునేందుకు మనకు అధికార యంత్రాంగం కూడా సహకరిస్తుంది.

# నవంబర్ 5న గ్రేటర్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సమావేశం



మామిడి సోమయ్య, అధ్యక్షుడు



-బొల్లం శ్రీనివాస్, కార్యదర్శి

హైదరాబాద్, మహానది న్యూస్,అక్టోబర్ 28:గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం నవంబర్ 5వ తేదీ బుధవారం ఉదయం 10గంటలకు చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో జరుగుతుందని సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మామిడి సోమయ్య, బొల్లం శ్రీనివాస్ లు తెలిపారు. సొసైటీకి సంబంధించిన పలు విషయాలపై సర్వసభ్య సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు.

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఇండ్లు, ఇళ్లస్థలాల సాధన కోసం 2008 లో ఏర్పడిన ఈ సొసైటీలో దాదాపు 1400 మంది జర్నలిస్టులు సభ్యులై ఉన్నారని, చాలా మంది సీనియర్ జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం 17 ఏళ్లుగా ఎదురు చూస్తున్నారని,ఇండ్ల స్థలాలు పొందకుండానే చాలా మంది జర్నలిస్టులు చనిపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ సొసైటీకి స్థలం ఇవ్వాలని కోరుతూ ముఖ్య మంత్రికి, మంత్రులకు పలు మార్లు వినతి పత్రాలు సమర్పించడం జరిగిందని, అయినప్పటికీ ప్రభుత్వం సుప్రీం కోర్టు తీర్పును అడ్డం పెట్టుకొని జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వకుండా తీవ్ర జాప్యం చేస్తుందని వారు ధ్వజమెత్తారు.నవంబర్ 5వ తేదీన జరిగే సొసైటీ జనరల్ బాడీ మీటింగ్ లో భవిష్యత్ కార్యాచరణపై కీలకమైన నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అత్యంత కీలకమ్మైన ఈ సర్వసభ్య సమావేశానికి సొసైటీ సభ్యులందరు తప్పని సరిగా ఉదయం 10 గంటల కల్లా హాజరు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

## తుపాను ప్రభావంలో
# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
### -జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, మహానది న్యూస్, అక్టోబర్ 28: జిల్లా వ్యాప్తంగా తుపాను ప్రభావంతో రాబోయే రెండు రోజులపాటు విస్తారమైన వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు.

ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.జిల్లాలోని గ్రామాలు, పట్టణాలు, నదీ పరివాహక ప్రాంతాలు, తక్కువ ఎత్తు ప్రాంతాల్లో నివసించే ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. వర్షపు నీరు చేరే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రజలు సురక్షిత ప్రదేశాలకు తరలించుకోవాలని, రహదారులు, వంతెనలు, వాగులు, చెరువులు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విద్యుత్ తీగలు తెగిన ప్రదేశాలు, చెట్లు కూలిన ప్రాంతాలకు ప్రజలు వెళ్లరాదని హెచ్చరించారు.వ్యవసాయ రంగంపై తుపాను ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు పంట రక్షణ చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. ప్రస్తుతం కోతలకు సిద్ధంగా ఉన్న వరి పంటను రెండు మూడు రోజులపాటు వాయిదా వేయాలని, ఇప్పటికే కోసిన పంటను సురక్షిత ప్రదేశాలకు తరలించి ఎత్తయిన ప్రదేశాల్లో నిల్వ చేయాలని




సూచించారు.కోసిన పంటపై టార్పాలిన్ లేదా ఇతర కవర్లతో కప్పి వర్షపు నీరు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. రైతులు ముందస్తు చర్యలు తీసుకోవడం ద్వారా పంట నష్టాన్ని నివారించుకుని ఆర్థిక నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు.పంట నిల్వ కేంద్రాలు, మార్కెట్ యార్డులు, కొనుగోలు కేంద్రాలలో నీరు చేరకుండా రక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ప్రతి విభాగం సమన్వయంతో పని చేయాలని సూచించారు.

## దివ్యాంగుల సదరం
# శిబిరాన్ని పరిశీలించిన కలెక్టర్

కొత్తగూడెం, మహానది న్యూస్, అక్టోబర్ 28: కొత్తగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జరుగుతున్న దివ్యాంగుల వైకల్యం నిర్ధారణ సదరం శిబిరాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పరిశీలించారు. శిబిరంలో జరుగుతున్న వైద్య పరీక్షలు, ఆన్‌లైన్ దరఖాస్తుల నమోదు ప్రక్రియను ఆయన ప్రత్యక్షంగా పరిశీలిస్తూ దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, సేవల లభ్యత, పరికరాల పనితీరును సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి దివ్యాంగుడు తగిన గుర్తింపు పొందేలా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. యూనిక్ డిసెబిలిటీ ఐడెంటిటీ (యూడీఐడీ) కార్డుల ద్వారా ఆరోగ్యం, విద్య, ఉపాధి, రవాణా రంగాలలో కేంద్ర, రాష్ట్ర పథకాల ప్రయోజనాలు సులభంగా అందుబాటులోకి వస్తాయని వివరించారు. వైకల్యం నిర్ధారణ కోసం ఆసుపత్రిలో స్లాట్ బుకింగ్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేయాలని, దరఖాస్తుదారులకు ముందస్తుగా సమాచారం అందించి సమయానికి పరీక్షలు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. అవసరమైన వైద్య నిపుణులు, పరికరాలు, సాంకేతిక సిబ్బంది పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శిబిరం ప్రాంగణంలో దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా కూర్చొని వేచి ఉండేందుకు రిసెప్షన్ సెంటర్, కుర్చీలు, నీడ, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంపులు, వీల్‌చెయిర్లు వంటి



వసతులు కల్పించాలని సూచించారు. దివ్యాంగులకు అనుకూలమైన వాతావరణం సృష్టించడం ప్రభుత్వ బాధ్యతగా భావించాలని తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం వైకల్యం శాతం, వ్యక్తిగత వివరాలు, వైద్య నిపుణుల ధృవీకరణ వివరాలు యూడీఐడీ పోర్టల్‌లో సమగ్రంగా నమోదు చేయాలని, ఎటువంటి లోపాలు లేకుండా డేటా ఎంట్రీ పూర్తిచేయాలని ఆదేశించారు. డిజిటల్ రూపంలో భద్రపరిచిన సమాచారం భవిష్యత్తులో పథకాల అమలుకు బలమైన ఆధారమవుతుందని పేర్కొన్నారు.

## రైతు సంక్షేమానికి కృషి విజ్ఞాన
# కేంద్రాల సేవలు మార్గదర్శకాలు
### -జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

కొత్తగూడెం, మహానది న్యూస్, అక్టోబర్ 28: రైతు సంక్షేమానికి కృషి విజ్ఞాన కేంద్రాల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. కొత్తగూడెంలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న నూతన వ్యవసాయ సాంకేతిక పద్ధతులు, భూసార పరీక్షా కేంద్రం కార్యకలాపాలు, సమగ్ర వ్యవసాయ నమూనా యూనిట్లను పరిశీలించారు. కేంద్రంలోని పరిశోధన, శిక్షణా కార్యక్రమాలు, రైతు అవగాహన కార్యక్రమాలపై శాస్త్రవేత్తలతో చర్చించి, రైతుల అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ సందర్భంగా కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ టి. భరత్ జిల్లా వ్యాప్తంగా రైతులకు అందిస్తున్న సాంకేతిక మార్గదర్శకత, పంట విస్తరణ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాల అనుసంధానం, శిక్షణా కార్యక్రమాల వివరాలను సమగ్రంగా వివరించారు. గిరిజన ఉపాధి పథకం కింద కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో పాల్గొని, ఇల్లందు మండలం పోపెల్లి గ్రామ రైతులతో ముచ్చటించారు. పట్టుపురుగుల పెంపకం, విప్పపువ్వు సాగు, సమగ్ర వ్యవసాయ పద్ధతులపై వారికి అవగాహన కల్పించారు. ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంబించడం ద్వారా పంట దిగుబడి, ఆదాయం రెండూ పెరుగుతాయని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ కృషి విజ్ఞాన కేంద్రాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఆధారమని, రైతులకు శాస్త్రీయ అవగాహన, సాంకేతిక సహాయం, సమగ్ర వ్యవసాయ



పద్ధతుల ప్రాచుర్యం ద్వారా ఆదాయ వృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తరువాత అభివృద్ధి పనులు, భవిష్యత్ ప్రణాళికలు, విత్తనోత్పత్తి క్షేత్రాలు, రైతు మద్దతు సేవలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. భూసార పరిశీలన సదుపాయాలు విస్తరించాల్సిన అవసరం ఉందని, స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంట రకాలను అభివృద్ధి చేయాలని సూచించారు. రైతులకు సాంకేతికత చేరేలా డిజిటల్ అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. చివరగా గిరిజన రైతులకు తార్పాలిన్లు, వ్యవసాయ ఉపయోగ సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ హేమ శరత్ చంద్ర, బి. శివ, రైతులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మణుగూరులో ఘనంగా మంత్రి పొంగులేటి జన్మదిన వేడుకలు





మణుగూరు,మహానది న్యూస్, అక్టోబర్ 28: రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు మణుగూరులో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ప్రజా భవన్ లో జరిగిన ఈ వేడుకల్లో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.తరువాత శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మణుగూరు 100 పడకల ఆసుపత్రిని సందర్శించి, అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సేవా భావం, ప్రజల పట్ల అంకితభావం, అందరికీ ఆదర్శమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఉత్సాహంగా వేడుకలను నిర్వహించారు.

# రాక్ టౌన్ సొసైటీ ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలి
## -ఓటర్ల జాబితా తప్పుల తడక -పారదర్శకంగా ఉండేలా సవరించాలి



ఎల్బీనగర్, మహానది న్యూస్,అక్టోబర్ 28: ఎల్బీ నగర్ నియోజకవర్గంలోని రాక్ టౌన్ కాలనీలో నవంబర్ 16న జరుగనున్న కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ ఎన్నికలను సక్రమంగా జరపాలని సొసైటీ సభ్యులు, సీనియర్ జర్న లిస్టు మామిడి సోమయ్య ఎన్నికల అధికారిని కోరారు. సొసైటీ ఓటర్ల జాబితాను పరిశీస్తే...పూర్తిగా తప్పుల తడకగా ఉందని, వెంటనే జాబి తాను సవరించాలని ఆయన డిమాండ్ చేశారు.ఆయన మంగళవారం సాయంత్రం స్థానిక సొసైటీ కార్యాలయంలో సొసైటీ ఎన్నికల అధికారికి వినతి పత్రం అందజేశారు. సొసైటీలో దాదాపు 863 మంది ఓటర్లు ఉండగా వీరిలో చాలా మంది బోగస్ ఓటర్లు ఉన్నట్లు తెలుస్తుందని, వందకు పైగా ఓటర్లకు సంబంధించిన చిరునామాలు గానీ, ఫోన్ నెంబర్లు గానీ లేవనిఆరోపించారు. అంతే కాకుండా స్థానిక అడ్రస్ లో లేని ఓపెన్ ప్లాట్ యజమానులైన ఓటర్లను గుర్తించేందుకు ఎటువంటి ఆధారం లేకుండా బోగస్ ఓటర్లు ఓట్లు వేసే అవకాశం ఉందని, అలాంటి ఓటర్ల స్థానికతను నిరూపించే గుర్తింపు పత్రాలను ప్రదర్శించాలని డిమాండ్ చేశారు. తప్పుల తడకగా ఉన్న ఓటర్ల జాబితాను సవరించి సొసైటీ ఎన్నికలు సక్రమంగా, సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



# సంపాదకీయం

## నో కింగ్స్ ఉద్యమం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 2.0 పాలనపై ఏడాది తిరగకుండానే అమెరికాన్లు తిరుగుబాటు షురూ చేశారు. 2025, జనవరి 20న ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. మొదటి రోజు నుంచే సంచలన నిర్ణయాలు. అడ్మినిస్ట్రేటివ్ ఆర్డర్లు జారీ చేస్తూ అందరిలో భయం సృష్టించారు. రోజురోజుకూ తన పరిధిని మించి నిర్ణయాలతో ఇటు అమెరికన్లు.. అటు ప్రపంచ దేశాలు నిత్యం భయపడుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా వ్యతిరేక శక్తులు పెరుగుతున్నాయి. తన నిర్ణయమే ఫైనల్ అన్నట్లు ట్రంప్ తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా ఇదే తరుణంలో ట్రంప్ వేధింపులతో విసిగిపోయిన అమెరికన్లు ట్రంప్‌కు వ్యతిరేకంగా ఉద్యమం మొదలు పెట్టారు. అక్టోబర్ 18న అమెరికా అంతటా, అలాగే మిత్ర దేశాల్లోనూ 'నో కింగ్స్' పేరుతో భారీ నిరసనలు జరిగాయి. ఇది కేవలం రాజకీయ కార్యక్రమం కాదు.. రాజ్యాధికారానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే ఉద్యమంగా నిరసనకారులు పేర్కొంటున్నారు. దాదాపు 2,700 నగరాల్లో ఆందోళనలు జరగడం అమెరికా అధ్యక్షుడిపై వ్యతిరేకతకు అద్దం పడుతోంది. ఇందులో సుమారు 70 లక్షల మందికి పైగా పాల్గొన్నారు. ఈ ఉద్యమానికి ప్రేరణ.. 2016లో ప్రారంభమైన 'ఇండివైజబుల్' అనే సంస్థ నుండి వచ్చింది, ఇది మొదట ట్రంప్ అనుసరించే విధానాలకు వ్యతిరేకంగా ఏర్పడింది. ఇప్పుడు, వేలాది సంస్థలు కలిసి ఈ ఉద్యమానికి దిశానిర్దేశం చేస్తున్నాయి. అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్, టీచర్స్ ఫెడరేషన్, మూవ్ ఆన్ వంటి సంస్థలు ఇందుకు తోడ్పడుతున్నాయి. తాజాగా ఉద్యమకారులు.. ఒక కొత్త సూత్రాన్ని ప్రవేశపెట్టారు. దేశంలో కనీసం 3.5 శాతం ప్రజలు స్థిరంగా వీధుల్లోకి దిగితే ప్రభుత్వం మారే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ఇది ఎరికా చెనోవెత్, మారియా స్టీఫెన్ వంటి రాజకీయ శాస్త్రవేత్తల పరిశోధన ఆధారంగా రూపొందించారు. ఈ సిద్ధాంతం ఉద్యమానికి శాస్త్రీయ చట్టబద్ధతను ఇచ్చినా, దానికీ పరిమితులు ఉన్నట్టు నిపుణులు కూడా సూచిస్తున్నారు. ప్రజలు, స్వతంత్ర సంస్థలు ట్రంప్‌పై అనేక ఆరోపణలు చేస్తున్నారు. పాలనా తీరుపై అభ్యంతరాలు చెబుతున్నారు. వలసదారుల నిర్బంధం, బహిష్కరణను వ్యతిరేకిస్తున్నారు. రాజ్యాంగ సంస్థలపై ఆధిపత్యం చెలాయించడాన్ని నిరసిస్తున్నారు. నేషనల్ గార్డ్స్‌ను నగరాలకు నియమించడాన్ని తప్పు పడుతున్నారు. ప్రజా ధనాన్ని తన సొంత అవసరాలకు వాడుకోవడంపై మండిపడుతున్నారు. కోర్టుల తీర్పులను లెక్కచేయకపోవడంపైనా జనాగ్రహం పెల్లుబిగుస్తోంది. పెట్టుబడిదారుల అనుకూల ఆర్థిక విధానాలు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ఉన్నట్లు అమెరికన్లు భావిస్తున్నారు. ఈ చర్యల వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ కుదేలవడంతోపాటు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. వినియోగదారులపై విపరీతమైన భారం పడుతోంఇక నిరసనలపై ట్రంప్ స్పందిస్తూ.. 'వాళ్లు నన్ను రాజు అంటున్నారు, కానీ నేను కాను' అని ట్రంప్ వ్యాఖ్యానించినప్పటికీ, ఆయన స్వయంగా షేర్ చేసిన ఏఐ వీడియో ప్రపంచవ్యాప్తంగా విమర్శలకు దారితీసింది. ఆ వీడియోలో ఆయనను రాజుగా చూపిస్తూ నిరసనకారులపై దూషణ చేయడంపై జనం మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వీడియో ద్వారా అధ్యక్షుడి భాషను కాకుండా, అహంకారంగా ప్రజలు భావిస్తున్నారు. ట్రంప్ పెట్టిన ప్రారంభ హెచ్చరిక రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై సైకాలజికల్ ప్రెజర్ సృష్టించే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఉక్రెయిన్‌కు అత్యాధునిక దాడి సామర్థ్యమున్న క్షిపణులు అందిస్తామని చెప్పడం ద్వారా అమెరికా మళ్లీ విధేయత చూపించే ప్రయత్నం చేసింది. అయితే ఆ ప్రకటన తర్వాత మాస్కో నుంచి తీవ్రమైన హెచ్చరికలు వచ్చాయి. "ఉక్రెయిన్కు క్షిపణులు ఇస్తే, రష్యా?అమెరికా సంబంధాలకు తిరిగిపోని నష్టం జరుగుతుంది" అని పుతిన్ స్పష్టంగా వార్నింగ్ ఇచ్చాడు. దెబ్బకు ట్రంప్ వెనక్కు తగ్గారు. ఓవల్ ఆఫీసులో ట్రంప్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ?కతో సమావేశమైతో మహాక్ క్షిపణుల అంశంపై మాట్లాడారు. జెలెన్స్కీ?క, "అవి లభిస్తే పుతిన్ శాంతి చర్చలను సీరియస్‌గా తీసుకుంటాడు" అని అభిప్రాయపడ్డారని అమెరికా మీడియా పేర్కొంది. కానీ ట్రంప్ మాత్రం "ప్రస్తుత సమయంలో అమెరికా నిల్వలను తగ్గించలేను. నా ప్రాధాన్యం యుద్ధాన్ని ముగించడం" అని స్పష్టంగా చెప్పారని సమాచారం. ఈ అభిప్రాయం ఆయన కొత్త విధానంగా భావిస్తున్నారు. పుతిన్‌తో జరిగిన ఇటీవల భేటీ కూడా ఈ మార్పుకు కారణమని వాస్తవాలు సూచిస్తున్నాయి. ట్రంప్, రష్యా సహకారం లేకుండా ఉక్రెయిన్ శాంతి సాధ్యం కాదనే నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. అందుకే ఆయుధాలు పంపడంపై కాకుండా శాంతి చర్చలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. దీని వెనుక మరో అంశం కూడా ఉంది. అమెరికా అంతర్గత రాజకీయ ఒత్తిడి. కాంగ్రెస్‌లో కొందరు సెనేటర్లు యుక్రెయిన్‌కు ఆయుధాలు పంపడాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీంతో ట్రంప్ నిర్ణయానికి రాజకీయ మద్దతు కూడా లభిస్తోంది. ట్రంప్ పదే పదే మాట మార్చుతున్నారని విమర్శలు వస్తున్నా, ఆయనకు ఇది ఒక ప్రతిస్పందనాత్మక దౌత్యతంత్రం కావచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. హెచ్చరికల ద్వారా రష్యాను భయపెట్టే ప్రయత్నం చేస్తూ, చివర్లో వెనక్కు తగ్గడం ద్వారా శాంతి ఆదిపత్యం చూపే వ్యూహం అవుతుందేమో అన్న అభిప్రాయం కూడా ఉంది. అయితే ఈ యూటర్న్ ఆయన విశ్వసనీయతకు దెబ్బతీస్తోంది. ప్రపంచ నేతగా సామరస్యానికి బదులు అయోమయం సృష్టిస్తున్నారనే విమర్శలు పెరుగుతున్నాయి. 'నో కింగ్స్' ఉద్యమం ఒక స్పష్టమైన సందేశం ఇస్తోంది.. వ్యక్తి పూజను వీడి.. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టారు. ప్రస్తుతం రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అమెరికా విభజన దశను ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో ప్రజల నిరసన శక్తి తక్షణ ప్రభావం చూపకపోయినా, ఇది ట్రంప్ సామ్రాజ్యాన్ని కూల్చి ఒక చారిత్రాత్మక మలుపు కావచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.

# కోటకొండ చేనేతకు జాతీయస్థాయి గుర్తింపు

**-బీజేపీ జాతీయ నేత మురళీధర్ రావు**
**-కోటకొండ చీరలను పరిశీలించిన కామారెడ్డి ఎమ్మెల్యే**
**-స్టార్ హీరోయిన్లతో ప్రచారానికి ప్లాన్**
**-చేనేత అనేది అద్భుతమైన కళ**
**-కోటకొండ పంచలు తయారుచేసి విస్తృత ప్రచారం చేద్దాం**
**-మహిళల మనసు గెలుచుకునే కోటకొండ చీరలు అద్భుతం**
**-స్వదేశీ వాడకంతోనే చేనేతకు ఆసరా**

నారాయణపేట, మహానది న్యూస్, అక్టోబర్ 28:చేనేత వృత్తి అద్భుతమని, అది ఒక కళ అని భారతీయ జనతా పార్టీ జాతీయ పూర్వ ప్రధాన కార్యదర్శి మురళీధర్ రావు అభిప్రాయపడ్డారు. కోటకొండ చేనేత అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చేందుకు పాటుపడతానని పేర్కొన్నారు.

కోటకొండ చేనేత కార్మికుల కళ అత్యద్భుతమని ప్రశంసించారు. ఇక్కడ తయారు చేసిన చేనేత వస్త్రాలకు జాతీయస్థాయిలో ప్రచారం తీసుకువచ్చేందుకు పని చేద్దామన్నారు. కోటకొండలో పంచలు తయారుచేసి విక్రయించాలని సూచించారు. ఆ పంచలకు కోటకొండ బ్రాండ్ తీసుకురావాలన్నారు. ప్రస్తుతం స్వదేశీకి అద్భుతమైన ఆదరణ లభిస్తుందని, దానిని కోటకొండ చేనేత అందిపుచ్చుకోవాలన్నారు. రాష్ట్రంలో పేరుగాంచిన వివిధ ప్రాంతాల మాదిరే, కోటకొండ అనేది ఒక బ్రాండ్ గా తయారు కావాలని ఆయన పేర్కొన్నారు.

మురళీధర్ రావుతో పాటు కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతి కుమార్, భారతీయ జనతా పార్టీ దేవరకద్ర నియోజకవర్గ నాయకులు ఎగ్గని నర్సింలు సోమవారం నారాయణపేట జిల్లా కోటకొండ గ్రామానికి వచ్చారు. ఈ సందర్భంగా చేనేత సహకార సంఘం అధ్యక్షులు, భారతీయ జనతా పార్టీ నారాయణపేట జిల్లా పూర్వ అధ్యక్షులు పగుడాకుల శ్రీనివాసులు ఇంట్లో చేనేత వస్త్రాలు, పట్టుచీరలను వారు పరిశీలించారు. గద్వాల్, పైతాన్, సికో, తదితర రకాల పట్టు చీరలను వారు చూశారు. అత్యద్భుతమైన డిజైన్లు, ఆకర్షించే రంగుల చీరలు మహిళల మనసును గెలుచుకుంటాయని కితాబిచ్చారు. ఇంతటి ప్రతిభగల కార్మికులకు ప్రభుత్వం చేదోడువాదోడుగా ఉండాలని అభిప్రాయపడ్డారు. అయితే స్వయంగా తయారు చేసే చీరలకు సినిమా స్టార్ లతో ప్రచారం చేద్దామన్నారు. ప్రముఖ నటీమణులు హేమామాలిని, కుష్బూ వంటి తదితర ప్రముఖ హీరోయిన్లతో ఒక మారథాన్ నిర్వహిద్దామని చెప్పారు. కోటకొండ లో కానీ, లేక హైదరాబాదులో గాని షో ఏర్పాటు చేద్దామని మురళీధర్ రావు సూచించారు. అందుకు ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి స్పందిస్తూ.. పెద్దపెద్ద స్టార్లను ఒప్పించి, ప్రచారం చేయించే బాధ్యత మీరే తీసుకోవాలని మురళీధర్ రావు కి చెప్పారు. దీంతో ప్రచార బాధ్యతలు నేనే నిర్వహిస్తానని మురళీధర్ రావు



బదులిచ్చారు. చేనేత కళను కాపాడుకోవాలని పేర్కొన్నారు. ఖరీదైన కార్పొరేట్ వస్తువుల కంటే కూడా, చేనేత వస్త్రాలు భారతీయ ఆత్మను ప్రతిబింబిస్తాయని వారు అభిప్రాయపడ్డారు. స్వదేశీని ఆదరించడం.. చేనేతను అక్కున చేర్చుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని పేర్కొన్నారు. ఆర్థికంగా స్థిరపడిన వాళ్ళందరూ కూడా చేనేతను ఆదరించాలని సూచించారు. గ్రామానికి వచ్చిన ప్రముఖులను పగడాకుల శ్రీనివాసులు ఘనంగా సత్కరించారు.

**పెళ్లి కొడుకు ను ఆశీర్వదించిన నేతలు**

ఏబీవీపీ పాలమూరు రూరల్ పూర్వ భాగ్ ప్రముఖ్ చల్లపల్లి ఆంజనేయులు తమ్ముడు చర్లపల్లి సాత్విక్ వివాహం సందర్భంగా నవ వరుడిని నేతలు ఆశీర్వదించారు. భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకులు మురళీధర్ రావు, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శాంతి కుమార్,నారాయణపేట జిల్లా భారతీయ జనతా పార్టీ పూర్వ అధ్యక్షులు పగుడాకుల శ్రీనివాసులు, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి తదితరులు పెళ్ళికొడుకును వారింట్లో ఆశీర్వదించి, శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎంగలి సిద్దు, పగుడాకుల రవి, చెవుల కృష్ణయ్య, ఎంగలి నవీన్, ఎంగలి సురేందర్ , బొక్కి సాయిలు , కొత్తపల్లి తిరుపతి యాదవ్, కమ్మరి వెంకటేష్, కంచే కుమార్, వేపూరు రవి, వేపూరు కాంత్ రెడ్డి, కమ్మరిమహేష్, చుక్క గోవిందు, చర్లపల్లి ఆంజనేయు లు, చెవుల రవికుమార్ బీడీల లక్ష్మణ్, కుందేళ్ళ లక్ష్మయ్య, గుండెగారి లక్ష్మయ్య, గుండెగారి శ్రీనివాసులు, చుక్క ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి పట్టణ సమగ్రాభివృద్ధికిరూ.18.70 కోట్లు

**-ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపిన పట్టణ కాంగ్రెస్**



వనపర్తి,మహానది న్యూస్, అక్టోబర్ 27: వనపర్తి పట్టణం అమగ్రాభివృద్ధికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రూ.18కోట్ల 70 లక్షలు మంజూరు చేయించడం జరిగిందని వనపర్తి పట్టణ కాంగ్రెస్ పార్టీ నేతలు వెల్లడించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కెట్ ఛైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి తాలూకా కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త లక్కాకుల సతీష్ కుమార్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీర్ల విజయ చందర్, మాజీ మున్సిపల్ వైఎస్ చైర్మన్ బీ కృష్ణ, పాకనాటి కృష్ణ లుహా మాట్లాడుతూ పదేళ్లు అధికారం లో ఉన్న బీఆర్ ఎస్ పార్టీ అభివృద్ధి ని విస్మరించిందని వారు విమర్శించారు. వనపర్తి పట్టణం దినదినా భివృద్ధి చెందుతుందని వారు చెప్పారు.

వనపర్తి పట్టణంలోహా రోడ్లు,డ్రైనేజీ లు అస్తవ్యస్తంగా ఉన్నాయని వారు విమర్శించారు. పట్టణం రోజు రోజుకు విస్తరిస్తుందని, అందుకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి గుర్తించి నిధులు మంజూరు చేయించారని వారు తెలిపారు.ఎమ్మెల్యే మెగా రెడ్డి పదవి బాధ్యతలు చేపట్టిన తర్వాత వనపర్తి పట్టణానికి 50 కోట్లు తీసుకురావడం జరిగిందని,హా పట్టణంలో ఇంకా మిగిలిపోయిన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు తదితరహా పనులకు రూ.18 కోట్ల 70 లక్షలు మంజూరు చేయించడం జరిగిందన్నారు.హా ఎమ్మెల్యే మెగారెడ్డి,హారాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్స్ బ్రహ్మం చారి ఎల్ఐసి కృష్ణ, వినోద్, శరవంద, పరుశురాం, టీపీసీసీ వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్హాద్యారపోగు వెంకటేష్హాతదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయితీల్లో భారీగా మార్పులు..!

కాకినాడ, : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీల్లో క్లస్టర్ వ్యవస్థ రద్దుతో పాటు.. గ్రామ పరిపాలనా వ్యవస్థలో పలు నూతన సంస్కరణలకు ఏపీ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచన మేరకు రూపొందించిన ఈ సంస్కరణలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇకపై గ్రామ పంచాయతీలను స్వతంత్ర పరిపాలనా యూనిట్లుగా మార్చనున్నారు. దీని వల్ల పంచాయతీల్లో కొలువులు కూడా పెరగనున్నాయి. గ్రామ కార్యదర్శి హోదాను కూడా పెంచనున్నారు. ఆ వివరాలు..ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీలను బలోపేతం చేసేందుకు.. వాటికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు సంపూర్ణ సంస్కరణలు అమలు చేసేందుకు సిద్ధమయ్యింది. పునర్వ్యవస్థీకరణతో గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడానికి కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చింది. దీనిలో భాగంగా గ్రామ పంచాయతీల్లో క్లస్టర్ వ్యవస్థను రద్దు చేసింది. దీంతో 7,244 క్లస్టర్ల స్థానంలో ఉన్న 13,351 గ్రామ పంచాయతీలు.. ఇక మీదట ఇకపై స్వతంత్ర పరిపాలనా యూనిట్లుగా వ్యవహరిస్తాయి. గ్రామ పంచాయతీలను నాలుగు గ్రేడ్లుగా పునర్ వ్యవస్థీకరించేందుకు కూటమి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వీటితో పాటు అనేక సంస్కరణలు చేయగా.. ఏపీ కేబినెట్ వీటికి ఆమోదం తెలిపింది.నాలుగు గ్రేడ్లుగా గ్రామ పంచాయతీలను విభజించాలని భావించిన ప్రభుత్వం.. 10 వేలు జనాభా దాటిన పంచాయతీలను రూర్బన్ పంచాయతీలుగా గుర్తించింది. వీటిల్లో పట్టణ స్థాయి మౌలిక సదుపాయాలు కల్పించి.. వాటిని రూర్బన్ పంచాయతీలుగా రూపొందించనున్నారు. అలానే గ్రామ కార్యదర్శి హోదాను.. పంచాయతీ అభివృద్ధి అధికారి (పీడీఓ)గా మారుస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసు కుంది. వీటితో పాటు పంచాయతీ రాజ్‌లో ప్రత్యేకంగా ఐటీ విభాగం ఏర్పాటు చేసేందుకు కూటమి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కొత్తగా తీసుకు వచ్చిన సంస్కరణల ప్రకారం, గ్రామ పంచాయతీలను స్పెషల్, గ్రేడ్-1, గ్రేడ్-2, గ్రేడ్-3 అనే నాలుగు రకాలుగా వర్గీ కరిస్తారు. పట్టణాలకు సమీపం లో.. మైదాన ప్రాంతాల్లో ఉండి.. కనీసం 10,000 జనాభా కలిగి ఉండి.. కోటి రూపాయల ఆదాయం ఉన్న పంచాయతీలను ఇక మీదట రూరల్ అర్బన్ పంచాయతీలుగా పరిగణిస్తారు. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతాల్లో 5,000 జనాభా ఉన్న పంచాయతీలు కూడా ఈ కోవలోకి వస్తాయి. ఈ రూరల్ అర్బన్ పంచాయతీలు.. పురపాలికల మాదిరిగానే పాలనను కొనసాగిస్తాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 359 పంచాయతీలు ఈ పరిధిలోకి వస్తాయి. గ్రేడ్ 1 కిందకు వచ్చే పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న 359 మంది కార్యదర్శుల వేతనాల పెంపుతోపాటుగా వారికి డిప్యూటీ ఎంపీడీఓ హోదా కల్పించారు. వీరిని రూర్బన్ పంచాయతీల్లో నియమించనున్నారు. అలాగే, 359 మంది జూనియర్ అసిస్టెంట్లకు.. సీనియర్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఇచ్చి రూర్బన్ గ్రేడ్ పంచాయతీల్లో నియమించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీనితో పాటు పంచాయతీ రాజ్ శాఖలో ప్రత్యేక ఐటీ విభాగం ఏర్పాటు చేయ నున్నారు.ఈ కొత్త వ్యవస్థతో పంచాయతీల్లో ఉద్యోగాల సంఖ్య భారీగా పెరుగుతుందని భావిస్తున్నారు.

# అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**-బిఆర్ఎస్ పాలనలో మున్సిపాలిటీల్లో జరిగిన అభివృద్ధి శూన్యం**
**-టపిసిసి ఉపాధ్యక్షులు నవాబ్ ముజాహిద్ అలంఖాన్**

హైదరాబాద్, మహానది న్యూస్,అక్టోబర్ 28: మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసిందని టిపిసిసి ఉపాధ్యక్షుడు నవాబ్ ముజాహిద్ అలంఖాన్ అన్నారు. రాష్ట్రంలోని 138 మున్సిపాలిటీలకు రూ.2,780కోట్లు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. మంగళవారం హైదరాబాద్, బర్కత్ పుర లోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో తెలంగాణలోని మున్సిపాలిటీల్లో జరిగిన అభివృద్ధి శూన్యం అని విమర్శించారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2027లో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ తో పాటు రాష్ట్రమంతా ఉన్న పట్టణాలను 'గ్రోత్ హబ్'లుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. పట్టణాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టాలని ఉన్నతాధికారులకు సీఎం సూచించారని ఆయన తెలిపారు. పట్టణాభివృద్ధిలో భాగంగా మౌళిక వసతుల కల్పన, కాలుష్య నియంత్రణ, పౌర సేవలు మెరుగురచడం వంటి వాటికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీలకు రూ.15 కోట్లు. అదనంగా గ్రామ పంచాయతీలు విలీనమైన మున్సిపాలిటీలకు రూ.20 కోట్లు, పాత



మున్సిపాలిటీలకు రూ.15 కోట్లు, కొత్తగా ఏర్పడిన మున్సిపల్ కార్పొరేషన్లకు రూ.30 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. మున్సిపాలిటీల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం, ప్రధాన కూడళ్ళ అభివృద్ధి, పార్కుల సుందరీకరణ వంటి పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వానికి ప్రజలు కూడా పూర్తి స్థాయిలో సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# కార్పొరేట్ల చేతిలో రూ.25 వేల కోట్ల విలువైన భూములు?

నెల్లూరు : పరిశ్రమల ఏర్పాటు, యువతకు లక్షలాది ఉద్యోగాలు, ఉపాధి కల్పన పేరుతో ప్రత్యేక ఆర్థిక మండళ్ల (సెజ్‌ల) కోసం తీసుకున్న భూములు నిరుపయోగంగా ఉన్నాయి. 2004 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఐదు సెజ్‌ల ఏర్పాటు పేరుతో సుమారు 60 వేల ఎకరాల భూములను ప్రభుత్వాలు రైతుల నుంచి బలవంతంగా లాక్కున్నాయి. ఇందులో అత్యధిక భాగం పంట పొలాలే. ఇప్పటి వరకు పది వేల ఎకరాల్లో మాత్రమే పరిశ్రమలు వచ్చాయి. దాదాపు 50 వేల ఎకరాలు ఖాళీగా ఉన్నాయి. 18 సంవత్సరాల నుంచి ఈ భూములు బీడుగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ భూములకు ఎకరాకు రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు ధర ఉంది. ఎకరా రూ.50 లక్షల లెక్కించినా కార్పొరేట్ల గుప్పిట్లో సుమారు రూ.25 వేల కోట్ల విలువైన భూములు చిక్కుకున్నాయి. సారవంతమైన ఈ భూముల్లో పంటలు పండిస్తే సుమారు 54 లక్షల పుట్లు (ఒక పుట్టికి 850 కిలోలు) దిగుబడి వచ్చేది. ప్రస్తుతం ఉన్న ధరల లెక్కల ప్రకారం సుమారు రూ.10 వేల కోట్లు ధాన్యం దిగుబడి లభించేది. 2004లో మాంబట్టు, మేనకూరు, తడ, శ్రీసిటి, చింతవరం, కృష్ణపట్నం, రేగడచెలిక ప్రాంతాల్లో సెజ్‌లు ఏర్పాటయ్యాయి. ఇక్కడ పరిశ్రమలు వచ్చి ఉంటే జిల్లా పరిస్థితి మరోలా ఉండేది. మేనకూరు, తడ, శ్రీసిటి, చింతవరం%ౌ% తిరుపతి జిల్లాలో కలిసిపోయాయి. కృష్ణపట్నం పోర్టు, మిగిలిన సెజ్‌లు నెల్లూరు జిల్లాలోనే ఉన్నాయి. జిల్లాలో 180 కిలోమీటర్ల సముద్రతీరం ఉంది. జాతీయ రహదారిని, కృష్ణపట్నం పోర్టును చూపి ప్రభుత్వం 18 సంవత్సరాల నుంచి జిల్లా యువతను మురిపిస్తూ వచ్చింది.

# నవంబర్ 1 నుంచి 5 వరకు గురునానక్ దేవ్ జీ జయంతి వేడుకలు

## -3న అఫ్జల్ గంజ్ లోని శ్రీ గురు సింగ్ సభ నుండి నగర కీర్తనలు ప్రారంభం



హైదరాబాద్, మహానది న్యూస్,అక్టోబర్ 28: సిక్కుల తొలి గురువు గురు నానక్ దేవ్ జీ 556వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు... గురుద్వారా శ్రీ గురు సింగ్ సభ (అఫ్జల్‌గంజ్), గురుద్వారా సాహెబ్ (సికింద్రాబాద్) ప్రబంధక కమిటీ లు సంయుక్తంగా ఏర్పాట్లు చేస్తోంది. ప్రకాశ్ ఉత్సవ్ పేరిట నవంబర్ 1 నుంచి 5 వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు... ప్రబంధక కమిటీ అధ్యక్షులు సత్వీందర్ సింగ్ బగ్గా, బల్దేవ్ సింగ్ బగ్గా, హర్ పీతం సింగ్ గులాటి, జస్పాల్ సింగ్ లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం, అఫ్జల్ గంజ్ లోని అశోక్ బజార్ గురు ద్వార్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో... వేడుకలకు సంబంధించిన కర పత్రాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. నవంబర్ 1న సికింద్రాబాద్ గురుద్వారా సాహెబ్ నుండి... నవంబర్ 3న అఫ్జల్‌గంజ్ గురుద్వారా శ్రీ గురు సింగ్ సభ నుండి... రంగురంగుల నగర కీర్తనలు (పవిత్ర ఊరేగింపులు) నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక వాహనంలో మత గ్రంథం గురు గ్రంథ్ సాహిబ్ ని ఊరేగించనున్నట్లు వెల్లడించారు. ఈ ఊరేగింపుల్లో సంప్రదాయ విన్యాసాలైన కత్తి, కర్రసాముల, గుట్కా విన్యాసాలతో పాటు..పంజాబ్ నుంచి మార్షల్ ఆర్ట్స్ కళాకారులు, పంజ్ ప్యారాలు, శాబాద్ కీర్తనలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయని పేర్కొన్నారు. విశాల్ దివాన్ ఉత్సవ్ వేడుక నవంబర్ 5న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరుగుతుందన్నారు. సుమారు 25,000 మందికి పైగా భక్తులు పాల్గొంటారని... దేశ, విదేశాల నుండి ప్రసిద్ధ రాగి జాతాలు గురుబానీ కీర్తనలు పఠిస్తారని తెలిపారు. అదే విధంగా నవంబర్ 4న సికింద్రాబాద్ గురుద్వారాలో, నవంబర్ 5న అఫ్జల్‌గంజ్ గురుద్వారాలో రాత్రి కీర్తనలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో జనరల్ సెక్రెటరీ జగన్మోహన్ సింగ్, జోగేంద్ర సింగ్ ముజ్రల్, బచన్ సింగ్ లతో పాటు పెద్ద సంఖ్యలో సిక్కు సోదరులు పాల్గొన్నారు.

# మట్టి తింటున్నాడు.. ప్రమాదమా?



మా బాబుకు మూడేండ్లు. యాక్టివ్‌గా ఉంటాడు. అల్లరి ఎక్కువే! బాగా చీదర కూడా చేస్తుంటాడు. మట్టి తింటున్నాడు. పైగా కింద పడిన పదార్థాలు కూడా తింటుంటాడు. భోజనం చేయడు. ఇప్పటికీ పాలు తాగుతాడు. ఎంత ప్రయత్నించినా పాలు మానడం లేదు. రోజుకు ఆరుసార్లు బాటిల్ పాలు తాగుతాడు! అన్నిటికన్నా ముఖ్యంగా మట్టి తినడం ఏదైనా ప్రమాదమా? సలహా ఇవ్వగలరు?

మీ అబ్బాయికి మూడేండ్లు అని చెబుతున్నారు. ఇంకా పాలు తాగు తున్నాడనిఅంటున్నారు. బిడ్డకు మొదటిఆరు నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. తర్వాతి ఆరు నెలలు క్రమంగా తల్లిపాలు తగ్గిస్తూ ఘన పదార్థాలు ఇవ్వాలి. రెండేండ్ల వయసు వచ్చే దాకా పిల్లలకు తల్లిపాలు ఇవ్వొచ్చు. అదనంగా 250 మిల్లీలీటర్ల కన్నా ఎక్కువగా పాలు ఇవ్వకూడదు. పాలు అధిక మోతాదులో తీసుకోవడం వల్ల బిడ్డకు ఆకలి వేయదు. ఫలితంగా ఆహారం తీసుకోడు. దీంతో బిడ్డ ఎదుగుదలకు అవసరమయ్యే విటమిన్లు, ఐరన్ లాంటి పోషకాలు లభ్యంకావు. బిడ్డకు పోషకాల న్యూనతఏర్పడుతుంది. మీబిడ్డ విషయం లో మట్టితినడం, కిందపడిన పదార్థాలు తినడం చేస్తున్నారని చెప్పారు. దీనిని పైకా అంటారు. 'ఐరన్ డెఫిషియెన్సీ- ఎనీమియా' ఉన్న పిల్లల్లో ఈ తరహా లక్షణాలు కనిపిస్తాయి. ఐరన్ లోపం వల్ల ఈ తరహా ప్రవర్తన కలుగుతుంది. మీ బిడ్డ విషయంలో ఎనీమియా ఉన్నదని నా అనుమానం. వెంటనే పీడియాట్రీషియన్‌ని సంప్రదించండి. అదేవిధంగా పాలు ఎక్కువగా తాగడం వల్ల మలబద్ధకం సమస్య కూడా తలెత్తుతుంది. మీరు మీ బిడ్డకు ఇచ్చే పాలు తక్షణం గణనీయంగా తగ్గించాల్సి ఉంటుంది. అంటే పాల పరిమాణం రోజుకు 250 మిల్లీలీటర్లకు మించకుండా చూసుకోండి. ఉదయం, సాయంత్రం చిన్నగ్లాసెడు చొప్పున పాలు ఇవ్వండి. దీంతోపాటు పోషక విలువలు ఉన్న ఆహార పదార్థాలు ఇవ్వండి. అన్నం, కూరగాయలు, పెరుగు, మాంసాహారులైతే మటన్, చికెన్, గుడ్డు తదితర పదార్థాలు తగిన మోతాదులో బిడ్డకు అందివ్వండి. ఐరన్ పెరగడానికి వైద్యులు సిరప్ కూడా ఇస్తారు. అంతేకాకుండా ఐరన్ సమృద్ధిగా లభించే కాయగూరలు తినాలి. మాంసాహారులైతే మటన్, లివర్ లాంటివి పిల్లలకు పెట్టాలి. అలాగే హిమోగ్లోబిన్ టెస్ట్ చేయించండి. వైద్యుడి సలహా మేరకు ముందుకువెళ్లండి.


# ప్రొటీన్లు మోతాదు దాటొద్దు



మన శరీర నిర్మాణంలో, ఆరోగ్యంలో ప్రొటీన్లు కీలకపాత్ర పోషిస్తాయి. తగిన మోతాదులో ప్రొటీన్లు తీసుకోవడం వల్ల%ొ% కండరాల పెరుగుదల, వాటి మరమ్మతు, బరువు నిర్వహణ, రోగ నిరోధక వ్యవస్థ పనితీరు సాఫీగా ఉండటం మొదలైన ప్రయోజనాలు ఎన్నో సమకూరుతాయి. ప్రొ టీన్ల లోపాన్ని సరిదిద్దుకోవడానికి మాంసం, సముద్ర ఆహారం, గుడ్లు, పాల ఉత్పత్తులు, బీన్స్, పప్పుధాన్యాలు, గింజలు, విత్తనాలు, సోయా లాంటివి తీసుకోవాలని నిపుణులు సూచిస్తారు. కొంతమందికి మాత్రం ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం ఆరోగ్యానికి నష్టం కలిగిస్తుంది. కాబట్టి, ఇతర పోషకాల లాగే ప్రొటీన్లు కూడా మోతాదు మించకుండా తీసుకోవాలి. కొన్ని ప్రత్యేక ఆరోగ్య పరిస్థితుల్లో అయితే అధిక ప్రొటీన్లు కీడుచేస్తాయి. అధిక ప్రొటీన్లు ఉన్న ఆహార పదార్థాలు ఎవరికి సమస్యాత్మకమో తెలుసుకుందాం.

కిడ్నీ వ్యాధిగ్రస్తులు: వీరిలో ప్రొటీన్లు శరీరంలో కలిసిపోయే (ప్రాసెసింగ్) ప్రక్రియ కష్టంగా ఉంటుంది. కాబట్టి, అధికంగా ప్రొటీన్లు తీసుకుంటే కిడ్నీలపై మరింత భారం పడుతుంది. సమస్య ముదురుతుంది. అధిక యూరిక్ ఆమ్లం : అధిక ప్రొటీన్లు ఉన్న ఆహారం, ప్రత్యేకించి రెడ్ మీట్, సముద్ర ఆహారం అధిక యూరిక్ ఆమ్లం సమస్యతో బాధపడేవారికి మరిన్ని సమస్యలు తెచ్చిపెడుతుంది. అధిక ప్రొటీన్లు శరీరంలో యూరిక్ ఆమ్లం స్థాయులను పెంచుతాయి. దీంతో శరీరంలో గౌట్ (కీళ్లనొప్పులు), కిడ్నీల్లో రాళ్లు లాంటి సమస్యలు తలెత్తే ముప్పు ఉంది.కిడ్నీ సమస్యలు ఉన్న మధుమేహ రోగులు: మధుమేహ రోగుల్లో రక్తంలో చక్కెర స్థాయులను నియంత్రించడానికి ప్రొటీన్లు అధికంగా ఉన్న ఆహారం దోహదపడొచ్చు. కానీ, వారికి ఏదైనా కిడ్నీ వ్యాధిగాని, నెఫ్రోపతీగానీ ఉంటే మాత్రం అధిక ప్రొటీన్లు ఉన్న ఆహారాలుహాని కలిగిస్తాయి. కాబట్టి, మీరేదైనా ఆరోగ్య సమస్యతో బాధపడుతుంటే, ప్రొటీన్లు ఎంత మోతాదులో తీసుకోవాలనే విషయం లో వైద్యుణ్ని గానీ, గుర్తింపు పొందిన పోషకాహార నిపుణుడిని (డైటీషియన్) గానీ సంప్రదించాలి. మీ ఆరోగ్య పరిస్థితులు, జీవనశైలిని బట్టి వాళ్లుమీకు అనుకూలమైన ఆహారవిధానాన్ని సూచిస్తారు. ప్రొటీన్లు మంచివని ఇష్టం వచ్చినంత తీసుకోకూడదని గుర్తుంచుకోవాలి.

# ఆందోళన.. అనారోగ్యం!



కొందరిలో ఏ చిన్న వార్త విన్నా.. గుండె వేగంగా కొట్టుకుంటుంది. ఛాతీలో బిగుసుకుపోయినట్లు అనిపిస్తుంది. ఈ సమస్య.. దీర్ఘకాలంలో గుండెపోటుకు దారితీస్తుంది. ముఖ్యంగా పెరిమెనోపాజ్, మెనోపాజ్ దశల్లో ఉన్న మహిళల్లో.. దీర్ఘకాలిక ఒత్తిడి హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని గణనీయంగా పెంచుతున్నదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీర్ఘకాలిక ఒత్తిడి, హార్మోన్లు, గుండె ఆరోగ్యం.. మహిళల జీవితాలతో లోతుగా ముడిపడి ఉంటాయనీ, నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దీర్ఘకాలికంగా ఒత్తిడికి గురికావడం వల్ల శరీరంలో కార్టిసాల్ హార్మోన్ స్థాయులు పెరుగుతాయి. ఈ ఒత్తిడి హార్మోన్ ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్ ఉత్పత్తికి అంతరాయం కలిగిస్తుంది. అధిక కార్టిసాల్.. రక్త నాళాలను బిగుతుగా చేస్తుంది. రక్తంలో చక్కెరను పెంచుతుంది.

# నేడు ప్రపంచ స్ట్రోక్ డే

## -ప్రాణాంతక స్ట్రోక్ గురించి అవగాహన కలిగి ఉండాలి

## -ముషీరాబాద్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి




ప్రతి సంవత్సరం అక్టోబర్ 29న ప్రపంచ స్ట్రోక్ డే నిర్వహిస్తారు. ప్రాణాంతక స్ట్రోక్ (పక్షవాతం) గురించి అవగాహన కల్పించడం దీని ముఖ్య ఉద్దేశం. సాధారణ భాషలో... స్ట్రోక్ను బ్రెయిన్ అటాక్ అంటారు. మెదడులోని రక్తనాళాలు పూడుకొనిపోయినా, పగిలిపోయినా, మెదడులోని ధమనులు, సిరల్లోరక్త ప్రసరణకు ఆటంకాలుంటే స్ట్రోక్ వస్తుంది. పోషకాహారం తీసుకుంటూ, లైఫ్ స్టైల్లో మార్పులు చేసుకుంటే స్ట్రోక్ ను నివారించవచ్చునని ముషీరాబాద్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మనోజ్ రెడ్డి తెలిపారు.

**స్ట్రోక్ అంటే ఏంటి?**

రక్త ప్రసరణకు ఆవరోధం కలగడం లేదా నరాలు చిట్లడం వల్ల సంభవించే అత్యవసర వైద్య పరిస్థితిని స్ట్రోక్ అని అంటారు. అంటే మెదడుకు ఆక్సిజన్, ఇతర పోషకాలను తీసుకెళ్లే రక్తనాళాలు చిట్లిపోవడం, రక్తసరఫరాకు అంతరాయం ఏర్పడినప్పుడు మెదడులోని ఒక భాగానికి ఆక్సిజన్ అంతరాయం కలిగిస్తుందని డాక్టర్ మనోజ్ రెడ్డి తెలిపారు. ఇది ఆ భాగానికి సంబంధించిన కణ మరణానికి దారితీస్తుంది. స్ట్రోక్ సంభవించినప్పుడు శాశ్వత నష్టాన్ని నిరోధించడం కోసం సకాలంలో చికిత్స చేయడం అవసరం.

**స్ట్రోక్ రావడానికి గల కారణాలు**

అథెరోస్క్లెరోసిస్ అనబడే వ్యాధి స్ట్రోక్ రావడానికి కారణమవుతుంది. వయస్సు మళ్లే కొద్ది స్ట్రోక్ వచ్చే అవకాశాలు పెరుగుతాయి. ధూమపానం, శారీరక శ్రమ లేకపోవడం, అనారోగ్యకరమైన ఆహారం, ఇష్టానుసారంగా మత్తు పానీయాల వినియోగించడం, హైపర్ టెన్షన్, ఏట్రియల్ ఫిబ్రిలిఏషన్, అధిక కొలెస్ట్రాల్ స్థాయులు, ఊబకాయం, జన్యుపరమైన నిర్మాణంతో పాటు మానసిక సమస్యలు కూడా స్ట్రోక్‌కు కారణమవుతాయి. ఆడవారితో పోలిస్తే మగవారిలో ఎక్కువగా స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. అయితే బీపీ, కొలెస్ట్రాల్, షుగర్ లెవల్స్‌ను కంట్రోల్‌లో ఉంచుకోవడం ద్వారా స్ట్రోక్ రాకుండా జాగ్రత్త పడొచ్చు.

**స్ట్రోక్ లక్షణాలు**

- అకస్మాత్తుగా ముఖం, చేయి, కాలులో తిమ్మిర్లు లేదా బలహీనంగా అనిపించడం
- అకస్మాత్తుగా మాట్లాడటంలో ఇబ్బంది, విషయాలు అర్థం చేసుకోలేకపోవడం
- ఒకటి లేదా రెండు కంటి చూపుల్లో ఇబ్బందులు ఏర్పడటం
- నడవడానికి ఇబ్బంది, సరిగ్గా బ్యాలెన్స్ చేసుకోలేకపోవడం
- ఎటువంటి కారణం లేకుండా విపరీతమైన తలనొప్పి

ఇలా స్ట్రోక్ లక్షణాలను FAST అనబడే శబ్దంతో గుర్తు పెట్టుకోవడంతో పాటూ గమనించవచ్చు.

Face (ఫేస్) – ముఖము ఒక ప్రక్కకు ఓరుగుతుండడం

Arms (చేతులు) – ఒక చేయి లేదా కాలులో బలహీనత ఏర్పడటం

Speech (మాటలు) – మాట్లాడటంలో ఇబ్బంది, సరిగ్గా మాట్లాడలేకపోవడం

Time ( టైం)– ఈ లక్షణాలు కాని కలిగి ఉంటే వెంటనే అత్యవసర సేవల వారికి కాల్ చేయాలని తెలుసుకోవడం అకస్మాత్తుగా ఇలాంటి లక్షణాలను గమనిస్తే వీలైనంత తొందరగా వైద్యుల వద్దకు తీసుకెళ్లాలి. ఆ సమయంలో స్ట్రోక్ యూనిట్‌తో పాటు MRT, CT Scan వంటి వసతులు ఉన్న ఆస్పత్రుల్లోకే తీసుకెళ్లాలి. స్ట్రోక్ వచ్చిన తర్వాత 4.5 గంటలు అత్యంత కీలకం ప్రస్తుతం ఉన్న వైద్య పరిజ్ఞానం ప్రకారం స్ట్రోక్ వచ్చిన తర్వాత 4.5 గంటల్లోగా చికిత్స అందించడం చాలా అవసరం. ఇస్కీమిక్ స్ట్రోక్‌లు వచ్చిన సందర్భంలో లక్షణాలు కనిపించిన తర్వాత నుంచి రక్తనాళాల్లో కట్టిన గడ్డలను నిర్మూలించడానికి అవసరమైన మందు rTPA థ్రాంబోలిసిస్ ను 4.5 గంటలలోగా మాత్రమే అందించినపుడు గడ్డలను కరిగించవచ్చు. ఇలా 4.5 గంటల సమయం దాటిన తర్వాత అతి కొద్ది కేసులలో మాత్రమే ఎండో వాస్కులర్ చికిత్స(మెకానికల్ థ్రాంబెక్టమీ) 24 గంటల వరకూ అందుబాటులో ఉంటుంది. స్ట్రోక్ వచ్చినప్పటి నుంచి మొదలు ఆస్పత్రికి వెళ్లి ఎంఆర్ఐ స్కాన్ చేసే వరకు అన్నీ కూడా ఈ 4.5 గంటల సమయంలోపే పూర్తి అవ్వాల్సి ఉంటుంది.

# మొక్కజొన్న పీచును పడేయకండి..



మొక్క జొన్నలను చాలా మంది ఎంతో ఇష్టంగా తింటుంటారు. ఒకప్పుడు ఇవి కేవలం సీజన్‌లోనే అందుబాటులో ఉండేవి. కానీ ఇప్పుడు ప్రతి సీజన్‌లోనూ అందుబాటులో ఉంటున్నాయి. మొక్కజొన్నలను చాలా మంది ఉడకబెట్టి లేదా కాల్చి తింటారు. ఎలా తిన్నా కూడా ఇవి ఎంతో రుచిగా ఉంటాయి. అయితే మొక్కజొన్నలను ఒలిచిన తరువాత కంకులను పడేస్తారు. కానీ వాటికి ఉండే పీచు మనకు ఎంతగానో ఉపయోగపడుతుంది. అమెరికా, చైనా సంప్రదాయ వైద్య విధానంలో మొక్కజొన్న పీచును కూడా ఎక్కువగా ఉపయోగిస్తారు. ఇందులో అనేక పోషకాలతోపాటు ఔషధ విలువలు కూడా ఉంటాయి. మొక్క జొన్న పీచు వల్ల మనకు కలిగే లాభాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

ఆర్థరైటిస్ నొప్పులకు..: మొక్కజొన్న పీచులో అనేక రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ముఖ్యంగా ఫ్లేవనాయిడ్స్, ఫినోలిక్ సమ్మేళనాలు, స్టెరాల్స్, సాపోనిన్స్, అల్లన్‌టోయిన్, ఆల్కలాయిడ్స్ అధికంగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్ వల్ల శరీరానికి జరిగే నష్టాన్ని నివారిస్తాయి. కణాలు డ్యామేజ్ అవకుండా చూస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. దీంతో గుండె జబ్బులు, డయాబెటిస్ రాకుండా చూసుకోవచ్చు. శరీరంలోని వాపులు సైతం తగ్గిపోతాయి. మొక్క జొన్న పీచులో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు ఆర్థరైటిస్ నొప్పుల నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. ఈ పీచులో ఉండే మెగ్నిషియం వాపులను, నొప్పులను తగ్గిస్తుంది. అందువల్ల ఆర్థరైటిస్ ఉన్నవారికి ఎంతగానో మేలు జరుగుతుంది.

డయాబెటిస్ తగ్గేందుకు..: మొక్కజొన్న పీచు వల్ల షుగర్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. ఇన్సులిన్ ఉత్పత్తి పెరుగుతుంది. శరీరం ఇన్సులిన్‌ను సరిగ్గా ఉపయోగించుకుంటుంది. క్లోమ గ్రంథిలో డ్యామేజ్ అయిన బీటా కణాలు మరమ్మత్తులకు గురవుతాయి. దీంతో షుగర్ లెవల్స్ అదుపులోకి వస్తాయి. డయాబెటిస్ నియంత్రణలో ఉంటుంది. సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాల ప్రకారం తరచూ మొక్కజొన్న పీచును తీసుకోవడం వల్ల డయాబెటిస్ నియంత్రణలో ఉంటుందని తేల్చారు. అయితే పీచును నేరుగా తినలేరు కనుక దీన్ని నీటిలో వేసి మరిగించి తాగాల్సి ఉంటుంది. ఈ పీచు సహజసిద్ధమైన డైయురెటిక్‌గా కూడా పనిచేస్తుంది. శరీరంలో అదనంగా ఉన్న ద్రవాలను బయటకు పంపుతుంది. దీంతో పాదాలు, చేతుల్లో ఉండే వాపులు తగ్గిపోతాయి. అలాగే బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారికి ఈ పీచు ఎంతో మేలు చేస్తుంది.

మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లకు..: మొక్కజొన్న పీచు మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లను సైతం తగ్గిస్తుంది. మూత్రాశయం, జననావయవాల దగ్గర బ్యాక్టీరియా, ఫంగస్ చేరకుండా చూస్తుంది. మూత్రం ధారాళంగా వచ్చేలా చేస్తుంది. శరీరంలోని వ్యర్థాలు పూర్తిగా బయటకు వెళ్లిపోతాయి. కిడ్నీ స్టోన్ల సమస్య ఉన్నవారు మొక్క జొన్న పీచు వేసి మరిగించిన నీళ్లను రోజూ తాగుతుంటే స్టోన్స్ కరిగిపోతాయి. మూత్రాశయ సంబంధ సమస్యలు ఉన్నవారికి కూడా ఈ కషాయం ఎంతగానో పనిచేస్తుంది. కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నవారు ఈ పీచును ఆహారంలో భాగం చేసుకుంటే మేలు జరుగుతుంది. దీని వల్ల చెడు కొలెస్ట్రాల్ (ఎల్‌డీఎల్) తగ్గి, మంచి కొలెస్ట్రాల్ (హెచ్‌డీఎల్) పెరుగుతుంది. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. ఇలా మొక్కజొన్న పీచుతో అనేక లాభాలను పొందవచ్చు.

# శనీశ్వర అనుగ్రహం పొందాలి !



శనిప్రభావం వల్ల మంచీచెడూ రెండూ జరుగుతాయి. శనీశ్వరుడి వల్ల మంచే ఎక్కువగా జరుగుతుంటుంది. అలాగే శనీశ్వరుడిని ఆరాధిస్తే పరిహారం కూడా అవుతుంది. అందుకే శని అని పిలువకూడదు... శనీశ్వరుడు అనే పిలవాలని అంటారు. ఎందుకంటే.. శనీశ్వరుడి ప్రభావం వద్దే వద్దు అనుకునే వారే అధికంగా ఉంటారు. ఏలినాటి శని, అష్టమ శని, అర్ధాష్టమ శని అనే ఈ పేర్లు వింటేనే చాలామంది వణికి పోతారు. కానీ శనీశ్వరుడు ఇచ్చే విశేషాలను గురించి తెలుసుకుంటే.. శనిప్రభావంతో ఏర్పడే నష్టాలను చూసి జడుసుకోము. శనీశ్వరుడిని ఆరాధిస్తాం. అదెలా గంటే? నీలాంజన సమాభాసం రవిపుత్రం యమాగ్రజం ఛాయా మార్తాండ సంభూతం తం నమామి శనైశ్చరం' అంటారు.నీలాంజనం- అంటే నల్లటి కాటుక రూపంలో ఉండే వాడని, రవిపుత్రం అంటే.. సూర్యుని పుత్రుడని, యమాగ్రజం-అంటే యమునికి సోదరుడని, ఛాయా మార్తాండ సంభూతం .

# ప్రజారోగ్యానికి ముప్పు!?




రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో నెలకొల్పుతున్న వైద్య కళాశాలలకు ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) నమూనాను వర్తింపజేసే టిడిపి కూటమి ప్రభుత్వ నిర్ణయం ఇప్పటికే మిణుకు మిణుకుమంటున్న ప్రజారోగ్యాన్ని మరింత చీకటిమయం చేస్తుంది. వైద్య విద్యను మరింతగా ప్రైవేటీకరిస్తుంది. ప్రభుత్వ ప్రతిపాదిత 'పిపిపి' మోడల్ ప్రైవేటు, కార్పొరేట్ల లాభాలకు బాగా ఉపయోగపడుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో మూడు సంవత్సరాల్లో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేయాలని గత వైసిపి ప్రభుత్వం తలచింది. కొత్తగా నెలకొల్పబోయే కాలేజీల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను వైసిపి ప్రభుత్వం ప్రవేశపెట్టగా, అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి తీవ్రంగా వ్యతిరేకించింది. తాము అధికారంలోకొస్తే సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని రద్దు చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చింది. ప్రజలు నిజమే కాదా అనినమ్మారు. అధికారంలో కొచ్చాక పి-3 అనడం ప్రజలకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కడమే. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయడమే.

సెల్ఫ్‌ఫైనాన్స్ అని వైసిపి సర్కారు వైద్య విద్యార్థుల భవిష్యత్తును పెనం మీదికి నెట్టగా కూటమి ప్రభుత్వం ఏకంగా పొయ్యిలోకి తోసినట్లయింది. రాష్ట్ర విభజన తర్వాత వైద్య విద్యలోకానీ, వైద్య మౌలిక సదుపాయాల్లోకానీ ఎ.పి. పరిస్థితి తెలంగాణతో పోల్చితే వెనకబాటులో ఉంది. విభజ నతో నష్టపోయిన రాష్ట్రంలో ప్రజలకు నాణ్యమైన వైద్య సదుపా యాలు అందుబాటులోకి రావాలంటే ప్రభుత్వ రంగంలో వైద్య విద్య, సౌకర్యాలు పెరగాలి. నవ్యాంధ్రలో పాలన చేసిన వైసిపి, టిడిపి ఆలోచన ఆ దిశలో లేదు.

రాష్ట్రంలో ఆరు వేల వరకు ఎంబిబిఎస్ సీట్లుండగా సగం ప్రైవేటు లోనివే. మొత్తం 36 మెడికల్ కాలేజీలు ఉండగా సగం ప్రైవేటువే. స్థానికంగా ప్రైవేటు మెడికల్ కాలేజీలో చదవాలంటే లక్షలు కుమ్మరించాలి. ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ శూన్యం. రాజకీయ నాయకులు, పలుకుబడి కలిగిన మోతుబరుల చేతుల్లో ప్రైవేటు మెడికల్ కాలేజీలున్న నేపథ్యంలో ఫీజులపై ప్రభుత్వ నియంత్రణ ఆశించడం శుద్ధ దండగ. అన్నేసి లక్షలతో ప్రైవేటు కాలేజీల్లో సీట్లు కొనలేకవైద్య విద్యపై ఆసక్తి ఉన్న ఔత్సాహిక యువత తమ ఆలోచన ను విరమించుకుంటున్నారు. మరికొంత మంది తక్కువ ఖర్చులో మెడిసన్ చేసేందుకు చైనా, ఫిలిప్పైన్స్, ఉక్రెయిన్ తదితర దేశాలకు వలస పోతున్నారు. కొత్తగా మెడికల్ కాలేజీలు ప్రభుత్వ రంగంలో నెలకొల్పుతారని విద్యార్థులు ఎంతో ఆశ పడ్డారు. పి-3 మోడల్ అని ప్రభుత్వం వారి ఆశలను అడియాశలు చేసింది.కూటమి సర్కార్ ప్రకటించిన 'స్వర్ణాంధ్ర విజన్ 2047' నినాదం ఐశ్వర్య,ఆరోగ్య, ఆనంద రాష్ట్రాన్ని నిర్మించడం. ప్రజలందరూ ఆరో గ్యవంతులు కావాలంటే ఆ రంగానికి బడ్జెట్‌లో అందుకు తగిన విధంగా నిధులు కేటాయించాలి. జిడిపిలో కనీసం 2.5 శాతం ప్రజారోగ్యానికి ప్రభుత్వాలు ఖర్చు చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ఆరోగ్యాంధ్ర చేస్తామంటున్న కూటమి సర్కారు తన బడ్జెట్‌లో ఆరు శాతం ఇవ్వడం కనాకష్టమైపోయింది. చివరికి ఎంత ఖర్చు చేస్తారో తెలీదు. ఆస్పత్రుల్లో మందుల్లేవని అధికార సభ్యులే అసెంబ్లీలో గోల చేశారు. 108,104 సేవలు, ఎన్‌టిఆర్ ఆరోగ్యసేవఅరకొరే. డాక్టర్లు, సిబ్బం ది ఖాళీలు వేలాదిగా ఉన్నా యని స్వయాన మంత్రి శాసనసభకు సెలవిచ్చారు.డాక్టర్ పోస్టులకు ఎన్నిసార్లు నోటిఫికేషన్లు ఇచ్చినా రాకపోవడానికి కారణం లక్షలు పోసి ప్రైవేటు కాలేజీల్లో చదివిన వారికిసంపాదన, కెరీర్ పరమా వధిగా దేశీయ కార్పొరేట్ ఆస్ప త్రులు, విదేశాల బాట పట్టడమే. ప్రతి వెయ్యి మందికీ ఒక క్వాలిఫై డ్ డాక్టర్ ఉండాలని డబ్ల్యుహెచ్ఒ నిర్దేశించింది.తామొచ్చాక ఆటార్గెట్‌ను దాటేశామం టోంది మోడీ ప్రభుత్వం.నగరాలు, పట్టణాల్లో ఆ నిష్పత్తిలో వైద్యు లుండవచ్చు నేమో కానీ గ్రామీణ ప్రాంతాల్లో, గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు చాలా చాలా అధమ స్థాయిలో ఉన్నాయనడానికి ఏజెన్సీలో తరచు కనిపించే డోలీ మోతలే నిదర్శనం.ఆరోగ్యం ప్రజల హక్కు.అదిసాకారం కావాలంటే ప్రభుత్వ రంగంలో వైద్య సదుపాయాలు పరిపుష్టం కావాలి. ప్రభుత్వ రంగంలోనే వైద్య కాలేజీలు, ఆస్పత్రులు కొనసాగాలి. పి-3, పి-4 నమూనాలు మితిమీరిన చార్జీలు మోది ప్రజల మూలగ పీలుస్తాయి.

# అరణి శ్రీనివాస్ కు తప్పని పాత వాసనలు!

తిరుపతి: తిరుపతి జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుపై పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆగ్రహంగా ఉన్నట్లు కనిపిస్తుంది. వైసీపీ నుంచి వచ్చి పార్టీలో చేరినా ఆరణి శ్రీనివాసులకు తిరుపతి నియోజకవర్గం టిక్కెట్ ఇచ్చారు. టీడీపీ బలంగా ఉన్నప్పటికీ, అక్కడ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తనకు కావాలని గట్టిగా కోరినప్పటికీ పవన్ కల్యాణ్ తిరుపతి నియోజకవర్గం సీటును పట్టుబట్టి జనసేన ఖాతాలో వేసుకున్నారు. పొత్తులో భాగంగా రాయలసీమలోని తిరుపతితో పాటు రైల్వే కోడూరు నియోజకవర్గాలను ఎంచుకున్నారు. చంద్రబాబు నాయుడు కూడా నాడు పొత్తులో భాగంగా తిరుపతి సీటును జనసేనకు కేటాయించారు. దీంతో కూటమి గాలిలో ఆరణి శ్రీనివాసులు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వైసీపీ నుంచి జనసేనలోకి గతంలో చిత్తూరు ఎమ్మెల్యేగా వైసీపీలో ఉన్న ఆయన పార్టీ మారి తిరుపతి జనసేన ఎమ్మెల్యే అయ్యారు.కానీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆరణి శ్రీనివాసులు పార్టీ క్యాడర్ ను పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. టీడీపీ, జనసేన క్యాడర్ ను పక్కన పెట్టి కొందరు వైసీపీ నేతలకు టచ్‌లో ఉన్నారంటూ ఆరో?పణలు పలు దఫాలు ఎదుర్కొన్నారు. జనసేన నాయకులే ఆరణి శ్రీనివాసులుపై ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారు. మరొకవైపు వైసీపీ నేతలు చేస్తున్న విమర్శలకు కూడా ధీటుగా ఆరణి శ్రీనివాసులు స్పందించక పోవడం కూడా ఆరణిపై ఆగ్రహానికి కారణమయిందంటున్నారు. ఉదయం లేచిన దగ్గర నుంచి వైసీపీ మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానంపై ఆరోపణలు, విమర్శలు చేస్తున్నప్పటికీ పాత పరిచయాలతో ఆరణి శ్రీనివాసులు స్పందించడం లేదన్న అనుమానం పార్టీ నాయకత్వంలో వ్యక్తమవుతుంది.. ఇటీవల తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్లాస్ పీకారని తెలిసింది. ఇలాగైతే ఎలా.. కూటమిలోని మూడు పార్టీల కార్యకర్తలను కలుపుకుని పోవాలని పవన్ కల్యాణ్ చెప్పారట. పాత పరిచయాలుంటే వాటిని వదిలేయాలని, జనసేనలో కొనసాగాలనుకుంటే మారాలని ఆరణి శ్రీనివాసులుకు పవన్ కల్యాణ్ ఒకింత సీరియస్ గానే చెప్పినట్లు తెలిసింది. దీంతో ఆరణి శ్రీనివాసులు ఇటీవల భూమన కరుణాకర్ రెడ్డి చేసే విమర్శలకు స్పందిస్తున్నారనితెలిసింది. మరొకవైపు తిరుపతి నియోజకవర్గంలోని జనసేన నేతల నుంచి కూడా పవన్ కల్యాణ్ ఎప్పటికప్పుడు ఆరణి శ్రీనివాసులుపై పవన్ కల్యాణ్ ఒక కన్నేసి ఉంచినట్లు సమాచారం. దీంతో వచ్చే ఎన్నికల్లో ఆరణి శ్రీనివాసులుకు టిక్కెట్ దొరుకుతుందా? అన్న డౌట్ కూడా పార్టీ నేతలే వ్యక్తం చేస్తున్నారు.

# దేశంలో నీటియాజామన్య లోపం..!

న్యూఢిల్లీ: వర్షాల ద్వారా మనం పాఠాలు నేర్చుకోవడం లేదు. వరదలను నివారించి, నీటిని నిల్వ చేసుకునే పద్ధతలను అవలంబించడం లేదు. దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్నా నిర్లక్ష్యంతో ప్రజలను బలి చేస్తున్నారు. వరదలతో సా మాన్యులు నిండా మునిగినా పాలకుల్లో చలనం రావడం లేదు. దేశంలో జాతీయ జలవిధానం కూడా అమలు కావడం లేదు. ప్రధాని మోడీ నదుల అనుసంధానం గురించి గొప్పలు చెప్పినా పదకొండేళ్లుగా ఆయనకూడా చేసింది శూన్యమనే చెప్పాలి. వరద ప్రాంతాల ప్రజలకు పక్కా ఇళ్లు నిర్మించి వారు వరద బారినపడకుండా చేయడం లేదు. వివిధ రాష్ట్రాల్లో చెరువుల ను మింగిన పాపానికి ఇటీవల కురిసిన వర్షాలకు నగరాలు, పట్టణా లు, గ్రామాలు నీట మునిగాయి. ఇదంతా పాలకుల పాపం కాక మరోటి కాదు.ఈక్రమంలో గొలుసుకట్టు చెరువులను రక్షించుకో వాలి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని కనీసం ఇప్పటి నుంచయినా నీటి అవసరాలను గుర్తించి పొదుపు చేయడం అలవా టు చేసుకోవాలి. గతంలో ఎప్పుడూ లేనంతగా దేశంలో జలాశయాలు నిండుకుండల్లా మారాయి. ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయడంతో మళ్లీ సముద్రంలోకి నీరు చేరుతోంది. ముందస్తు ప్రణాళికలు లేకపోవడ ంతో దేశంలో నీటి యాజమాన్యం సరిగా లేదని ఏటా కురుస్తున్న వర్షాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికితోడు అనేక జలాశయా ల్లో పూడిక పేరుకుని పోతోంది. ఏటేటా వర్షాలతో ఒండ్రు చేరుతోందని నిపు ణులు చెబుతున్నారు. ఇటీవలి వరదలకు ఉత్తరాది, దక్షిణాది అన్నతేడా లేకుండా అనేక నదులు ఉప్పొంగాయి. చివరకు మళ్లీ నీరుస ముద్రానికి చేరింది.తాజాగా కూడా అలాంటి పరిస్థితిని చూస్తున్నాం. ఇప్పటికైనా పాలకులు జాతీయ జలవిధానం రూపొందిం చాల్సి ఉంది. అలాగే వర్షాలతో నష్టపోయిన రైతులకు అండగా నిలిచి వారిని ఆదుకునే ప్రయత్నం చేయాలి.జలవిధానంకూడా అవసరమని గుర్తించాలి. జలవిధానం తోనదులనుదారి మళ్లిం చగలిగితే నీటి కటకటలు రావు. ఈయే డు వర్షాలు విపరీతంగా పడడమే గాకుండావరదలు పొంగినదులన్నీ ఉప్పొంగుతున్నాయి. ఈ దశలోనీటిసంరక్షణతో పాటు,రైతు సంక్షేమానికి చర్యలు తీసుకునే ప్రణాళికలు ముందుకు సాగాలి.

# పీ4 పథకంతో కుటుంబాల దత్తత

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎప్పుడు అధికారంలోకి వచ్చినా థింక్ ట్యాంక్ ను ఏర్పాటు చేసుకుంటారు. వారు అనేక రకాలుగా ఆలోచించి ఇటు ఓటు బ్యాంకు పెరిగి రాజకీయంగా పార్టీ బలోపేతం అవ్వడమే కాకుండా చంద్రబాబు పాలనకు మంచి మార్కులు జనంలో పడేలా అన్ని రకాలుగా ఆలోచించి తగిన పథకాలను రూపొందిస్తారు. థింక్ ట్యాంక్ రూపొందించిన వాటిలో వర్క్ అవుట్ అయ్యేవి మాత్రమే చంద్రబాబు అందిపుచ్చుకుం టారు. అందులో నుంచి ఈ ఏడాది వచ్చిందే పీ4 పథకం. పేదరిక నిర్మూలన కోసం ఈ పథకాన్ని తెచ్చారు. సంపన్నులు పది శాతం ఉంటే పేదరికం ఎక్కువ శాతం ఉంది కాబట్టి వారిని ఆదుకునేందుక ఈ పథకాన్ని తెచ్చారు.మొన్న ఉగాది నాడు పీ4 పథకాన్ని చంద్రబాబు నాయుడు అమరావతిలో ప్రారంభించారు. అయితే ఆశించిన రీతిలో ఇప్పటి వరకూ పెద్దగా రెస్పాన్స్ రాకపోవడంతో చంద్రబాబు పీ4 పథకానికి సంపన్నులు ఆకట్టుకునేలా చర్యలు తీసుకునేందుకు ప్రజాప్రతి నిధులతో పాటు తనకు సుదీర్ఘకాలం నుంచి సహకారం అందిస్తూ వస్తున్న పారిశ్రామిక వేత్తలకు అప్పగించారు. వచ్చే ఆగస్టు 15వ తేదీ నాటికి కనీసం ఐదు లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేం దుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకోసం ఆన్ లైన్ ద్వారా సంపన్నులు నేరుగా పేదలను ఆదుకునేలా అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధం చేయాలని ఆదేశించారు.నియోజకవర్గాల వారిలో ప్రధానంగా సంపన్నులను గురించి పీ4 పథకానికి సాయం అందించేందుకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు కూడా తమ వంతుగా ప్రయత్నం చేయాలని కోరారు. ఇది ఒక ఛాలెంజ్ గా తీసుకోవాలని ప్రజాప్రతినిధులను ఆదేశించారు. వచ్చే ఉగాది పండగ నాటికి ఎంత మేర బంగారు కుటుంబాలకు లబ్ది జరిగింది? సంపన్నుల పేర్లతో పాటు పారదర్శకంగా వివరాలను వెల్లడించి ఈ పథకాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేలా అవసరమైన చర్యలు సత్వరం ప్రారంభించాలని గట్టిగా కోరారు. తర్వాత పథకం దానంతట అదే విస్తృతంగా డెవెలెప్ అవుతుందని చంద్రబాబు గట్టిగా నమ్ముతున్నారు.ముఖ్యంగా పేదరికంలో మగ్గుతూ ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని బంగారు కుటుంబాల కింద ఎంపిక చేస్తే వారు కూడా పార్టీ జెండా దించకుండా మరింతగా రాజకీయంగా ఉపయోగపడతారని చంద్రబాబు వేస్తున్న అంచనాలు వర్క్ అవుట్ అయ్యే అవకాశం కనిపిస్తుంది. దీంతో పాటు వచ్చే ఏడాది కూడా మరో కొత్త పథకంతో జనం ముందుకు రావాలని చంద్రబాబు భావిస్తున్నారు. ఇప్పటికే చంద్రబాబు థింక్ ట్యాంక్ నాలుగైదు పథకాలకు రూపకల్పన చేసినట్లు సమాచారం. ప్రజలు ఎక్కువ శాతం మంది లబ్ది పొందేలా మరొక కొత్త పథకాన్ని చంద్రబాబు తెచ్చేయోచనలో ఉన్నారు.

# గోల్డ్ లోన్ ఏటీఎం... ఎలా పని చేస్తుందంటే..?



అర్జెంటుగా డబ్బులు అవసరం పడితే చాలా మంది బ్యాంకులో గోల్డ్ లోన్ తీసుకుంటుంటారు. బ్యాంకుకు వెళ్లి తమ వద్ద ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టి డబ్బులు తెచ్చుకుంటుంటారు. అయితే ఇదికొంచెం టైం టేకెన్ ప్రాసెస్. ముందుగా బ్యాంకుకు వెళితే.. అక్కడున్నగోల్డ్ అప్రైజర్ మన బంగారాన్ని తనిఖీ చేస్తాడు.ఎన్ని క్యారెట్లు.. ఎంత బరువుంది.. ఆ రోజు ధర ఎంతో లెక్కగట్టి బ్యాంకు అధికారులకు చెబుతారు. అప్రైజర్ ఇచ్చే రిపోర్టు ఆధారంగానే బ్యాంకులు గోల్డ్ లోన్ మంజూరు చేస్తాయి. ఆ తర్వాత బ్యాంకు అకౌంట్లలో డబ్బులు జమ అవుతాయి. ఈ ప్రాసెస్ జరగటానికి కొన్ని సార్లు రోజు మొ?త్తం పట్టే ఛాన్సు ఉంటుంది.ఇక నుంచి ఆ టెన్షన్ అక్కర్లేదు. నిమిషాల వ్యవధిలోనే బంగారంపై గోల్డ్ లోన్ పొందొచ్చు. ఈ మేరకు గోల్డ్‌లోన్ ఏటీఎంలు అందుబాటులోకి వచ్చాయి. సెంట్రల్ బ్యాంకుఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వరంగల్ నగరంలో ఈగోల్డ్ లోన్ ఏటీఎం ప్రారంభించారు. దేశంలోనే తొలిసారి ప్రయోగాత్మకంగా వరంగల్‌లో గోల్డ్ లోన్ ఏటీఎం అందుబాటులోకి తీసుకొచ్చినట్లు బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో ఎంవీరావు తెలిపారు. ఈ గోల్డ్ లోన్ ఏటీఎం ద్వారా చాలా సులభంగా లోన్ తీసుకోవచ్చునని చెప్పారు. ఈ యంత్రం వల్ల బ్యాంకు సిబ్బందికి, అలాగే ఖాతాదారుడికి సమయం ఆదా అవుతుందని అన్నారు. వరంగల్ నగరంలో విజయవంతమైతే దేశంలోని మిగతా ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. కొత్తగా ప్రారంభించిన గోల్డ్‌లోన్ ఏటీఎం ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్) సాంకేతికతతో రూపొందించారు.కేవలం 10 నుంచి 12 నిమిషాల్లోనే ఆధార్ కార్డు, మొబైల్ నంబరు ఆధారంగా ఏటీఎంసాయంతో గోల్డ్‌లోన్ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. లోన్ కావాలనుకునేవారు బ్యాంకు అకౌంట్ వివరాలు, ఆధార్ కార్డు నెంబర్, మొ?బైల్ నెంబర్ ఏటీఎం మిషన్ అడిగే ఆప్షన్‌లో ఎంటర్ చేయాల్సి ఉంటుంది.ఆ తర్వాత బంగారు ఆభరణాలు మిషన్‌లోని బాక్సులో వేయాలి.ఏఐ టెక్నాలజీ ద్వారా బంగారం నాణ్యత, బరువును, ఆరోజు ఉన్న మార్కెట్ ధరను లెక్క కడుతుంది.

# ముంబై-హైదరాబాద్ మధ్య హై-స్పీడ్ రైలు..!



హైదరాబాద్: ముంబై-హైదరాబాద్ మధ్య హై-స్పీడ్ రైలు నడపాలనే ప్రతిపాదన మరో బ్రైట్ ఫ్యూచర్‌కు నాంది పలకనుంది. ముంబై-హైదరాబాద్ హై-స్పీడ్ రైలు ప్రాజెక్టుతో దేశ రవాణా వ్యవస్థలోనే విప్లవాత్మక మార్పు అవుతుంది. ఇటు ఐటీ రాజధాని మరోవైపు ఆర్థిక రాజధాని కలిస్తే ఆర్థికాభవృద్ధి మరో ఎత్తుకు ఎదుగుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే ఇందులో ఇప్పుడు మరో ప్రధాన నగరం కలపాలని భావిస్తున్నారు. దీన్ని ఇప్పటి వరకు ముంబై, హైదరాబాద్ మధ్య నడపాలని భావించారు. కానీ దీన్ని బెంగళూరుకు కూడా అనుసంధానించాలని చూస్తున్నారు. దీనికి మైసూరు-చెన్నై మధ్య ప్లాన్ చేసిన హైస్పీడ్ రైలు కారిడార్‌ను కూడా కలపనున్నారు. ఇదే జరిగితే హైదరాబాద్, ముంబై, చెన్నై, బెంగళూరు మధ్య ప్రయాణ సమయం చాలా తగ్గిపోనుంది. ప్రస్తుతం ముంబై-అహ్మదాబాద్ మధ్య హైస్పీడ్ రైలు కారిడార్ నిర్మాణం జరుగుతోంది. అది ఒకసారి పూర్తి అయితే మిగతా ప్రాంతాలపై ఫోకస్ పెట్టనున్నారు. ఇంతలో మిగతా ప్రాంతాల మధ్య హైస్పీడ్ రైలు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేస్తున్నారు. అలా నిర్మించ తలపెట్టిన మార్గాల్లో హైదరాబాద్-ముంబై, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై ఉన్నాయి. కేవలం ఇవే కాకుండా వీటి మధ్య కూడా అనుసంధానిస్తే ఎలా ఉంటుందనే ఆలోచన కూడా కేంద్రం చేస్తోంది.హైదరాబాద్ ప్రస్తుతం ప్రయాణ సమయం 15 గంటలకుపైగానే ఉంది. ముంబై-హైదరాబాద్ మధ్య హై-స్పీడ్ రైలు నడిపినట్టు అయితే ఆ టైం చాలా వరకు తగ్గించ వచ్చు. ఎంతా అంటే... మూడున్నర గంటల్లోనే రాకపోకలు సాగించవచ్చు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్లాలంటే వందే భారత్ లాంటి ట్రైన్‌లో 8 గంటలు పడుతుంది. హైస్పీడ్ ట్రైన్ అందుబాటులోకి వస్తే 2 గంటల్లోనే చేరుకోవచ్చు. హైదరాబాద్ టు చెన్నై మధ్య దూరం 757 కిలోమీటర్లు. ఈ నగరాల రాకపోకలకు 15 గంటల సమయం పడుతుంది. హైస్పీడ్ రైలులో అయితే రెండున్నర గంటల్లోనే వెళ్లి రావచ్చు. ప్రస్తుతం పరిశీలన దశలో ఉన్న ఈ ప్రాజెక్టులు పూర్తి కావాలంటే మాత్రం పది నుంచి పదిహేనేళ్లు పట్టవచ్చని రైల్వే అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ అనుసంధానం జరిగితే దేశ మౌలిక వసతుల కల్పనలో గేమ్ ఛేంజర్ అవుతుందని అంటున్నారు. నేషనల్ హై-స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ నేతృత్వంలో ప్రణాళిక దశలో ఉందీ హైదరాబాద్, ముంబై మధ్య హైస్పీడ్ రైలు ప్రాజెక్టు. ప్రస్తుతానికి ఉన్న అంచనాల ప్రకారం 767 కిలోమీటర్ల ముంబై-హైద రాబాద్ హై-స్పీడ్ రైలు కారిడార్ ఏర్పాటు సాధ్యాసాధ్యాలపై చర్చ నడుస్తోంది. ముంబైని హైదరాబాద్‌తో 11 వ్యూహాత్మ స్టేషన్ల ద్వారా కలపనుంది.తొలి స్టేషన్ నవీ ముంబైలో ప్రారంభమై కొత్త నవీ ముంబై ఇంటర్నేషనల్‌ఎయిర్‌పోర్టు, మెట్రో, ట్రాన్స్ హార్బర్ మీదుగా లోనావాలా,పూణే, దౌండ్, అక్లుజ్, పంధర్‌పూర్, సోలాపూర్, కలబురగి, జహీరాబాద్ మీదుగా హైదరాబాద్‌కు చేరుకునేలా ప్లాన్ చేస్తున్నారు. జపాన్ టెక్నాలజీతో నిర్మిస్తున్న ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు ప్రాజెక్టు నిర్మిస్తున్నారు. అది పూర్తి అయితే ఆ రెండు నగరాల మధ్య గంటకు 320కి.మీ వేగంతో ప్రయాణం చేయవచ్చు. ఇప్పుడు అనుకు న్నట్టు నాలుగు నగరాల మధ్య హైస్పీడ్ ట్రైన్ కారిడార్‌తో అనుసంధా నం జరిగితే వాణిజ్యం, పెట్టుబడి, వ్యాపార సహకారాన్ని మరింత బలోపేతం అవుతుంది. ప్రయాణ సమయం తగ్గడంతో వస్తువులు, సేవలు, మనుషులరాకపోకలు సజావుగా సాగుతాయి. ఈ నాలుగు రాష్ట్రాల మధ్య ఆర్థిక సమైక్యత పెరుగుతుంది. కోట్ల మంది ప్రయాణికు లకు రవాణా సదుపాయాన్ని వేగవంతం, సౌకర్యవంతం చేస్తుంది. ఇది టూరిజాన్ని కూడా అభివృద్ధి చేస్తుంది. ప్రపంచ స్థాయిలో ఇండియన్ రైల్వే నెట్‌వర్క్ శక్తి మరోసారి నిరూపితం అవతుంది. దేశ సామర్థ్యం రుజువుచేస్తుంది. రైలు మార్గం నిర్మాణంతో ఇంజనీర్లు నుంచి రోజువారి కూలీల వరకు లక్షల ఉద్యోగాలు లభిస్తాయి.ఉపాధి పెరుగుతుంది. కనెక్టివిటీనిపెంచడం ద్వారా ఆర్థికవృద్ధి దూసుకెళ్లనుంది.స్టేషన్ ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో ప్రగతికి బాటలు పడతాయి. కొత్త వ్యాపా రాలు, పరిశ్రమలు,రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు అభివృద్ధి చెందుతాయి. సాధారణ రైళ్లు,మిగతా రవాణా వ్యవస్థలపైభారం తగ్గనుంది. లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని పెంచవచ్చు.ఈ హైస్పీడ్ రైలు ప్రాజెక్టు వల్ల పర్యావరణంపై ప్రభావం పడుతుందనే ఆందోళన ఉండనే ఉంది. ఈకారిడార్‌కు చాలా భూము లు కావాల్సి ఉంటుంది. అందుకు ప్రజలను ఒప్పించాలి. చెట్లు కొ ండలు,గుట్టలు తొలగించాల్సి ఉంటుంది. ఇదినిర్మాణంపూర్తి అయిన తర్వాత చాలా వరకు కర్బన ఉద్గారాలు తగ్గే అవకాశం ఉంది. ఈ ట్రైన్ అందుబాటులోకి వస్తే కార్లు,విమానాలు రైళ్ల వాడకం తగ్గిపోతుం ది. దీంతో కాలుష్య ప్రభావం ఉండదనే వాదన బలంగా వినిపిస్తుంది. ఇలాగంటల్లో జర్నీ చేసినట్టు అయితే ఆయా నగరాలపై జనాభా ఒత్తిడి తగ్గుతుంది. ప్రయాణంఎక్కువగా ఉండటంతో పని చేసిన చోటే కార్మికులు,ఉద్యోగాలు, ఇతర ప్రజలు ఉండటానికి మొగ్గు చూపుతున్నా రు.

# 'సనాతన' ఉన్మాదం..!

దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్‌పై సనాతనధర్మోన్మాదం తలకెక్కించుకున్న న్యాయవాది బూటు విసిరి దాడికి యత్నించిన అత్యంత ఆందోళనకర ఘటన ప్రస్తుతం దేశంలో నెలకొన్న దుస్థితిని తెలుపుతుంది. అత్యున్నత న్యాయస్థానంలో, అదీ ఒక కేసు విచారణ సందర్భంగా వాదనలు జరుగుతుండగా దుండగ మనస్తత్వం నిలువెల్లా నింపుకున్న ఒక లాయర్ ఎలాంటి జంకు భయం లేకుండా చీఫ్ జస్టిస్ పోడియం వైపుదూసుకెళ్లి దాడికి తెగబడటాన్ని తీవ్రంగా పరిగణించాలి. అప్రమత్తమైన భద్రతా సిబ్బంది ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించారు. ఈ హఠాత్పరిణామంతో కోర్టులో తీవ్ర గందరగోళం నెలకొనగా, ఇటువంటి బెదిరింపులు తనను ప్రభావితం చేయబోవని గవాయ్ చూపిన నిబ్బరం న్యాయవ్యవస్థపై గౌరవాన్ని, మన జ్యుడీషియరీ ధృఢత్వాన్ని ఇనుమడింపజేసింది. కాగా దాడి చేసిన వ్యక్తి సనాతన ధర్మానికి అవమానం జరిగితే సహించబోమంటూ కోర్టు హాలులో చేసిన నినాదాలనుబట్టి దాడికి ప్రేరణ ఏమిటో, ఎవరో సులభంగానే బోధ పడుతుంది. జస్టిస్ గవాయ్‌పై దాడి ఉదంతంపై దేశ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. రాజ్యాంగ రక్షణను అభిలషించే ప్రతి ఒక్కరూ చీఫ్ జస్టిస్‌పై దాడిని ఖండించాలి. జస్టిస్ గవాయ్ పై దాడి ఘటన అదేదో సాదాసీదా యాదృచ్ఛికంగా చోటు చేసుకున్నది కాదు. కేవలం ఒక వ్యక్తి పిచ్చి అంతనకన్నా కాదు. వందేళ్ల ఆర్ఎస్ఎస్, పరివారం ప్రజల మెదళ్లకు ఎక్కించిన విద్వేష విషం.

ప్రజల్లో మత విభజన సిద్ధాంత భావజాల వ్యాప్తిని ఘటన ప్రతిబింబిస్తుంది. కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చాక వ్యవస్థల ధ్వంసం సైద్ధాంతికం గా ఒక పథకం ప్రకారం సాగుతోంది. న్యాయ వ్యవస్థను సైతంవదిలిపెట్ట లేదు.జస్టిస్ గవాయ్ పై దాడి రాజ్యాంగానికి, ప్రజలకు అవమానం. సనాతన ధర్మాన్ని మోడీ ప్రభుత్వం భుజానికెత్తుకొని ప్రచారం చేస్తున్న తరుణంలో, జస్టిస్ గవాయ్ పై దాడుల వంటివే సనాతనధర్మమా?మోడీ, బిజెపి సమాధానం చెప్పాలి. మన రాష్ట్రం లో సనాతన ధర్మంపై ప్రచారం చేస్తున్న జనసేనాని పవన్ కళ్యాణ్, చీఫ్ జస్టిస్‌పై సనాతన వాది దాడిని ఖండిస్తారా, లేక మద్దతిస్తారో స్పష్టం చేయాలి. గవాయ్ పై దాడిని తరతమ భేదం లేకుండా పార్టీలు, సంస్థలు, వ్యక్తులు నిరసిస్తుండగా, ఇప్పటి వరకు బిజెపి, మోడీ ప్రభుత్వం నుంచి ఎలాంటి బహిరంగ స్పందన వెలువడలేదు. దీన్నిబట్టి దాడిని పరోక్షంగా స్వాగతిస్తున్నారనుకోవాలి. జస్టిస్ గవాయ్ దళిత కులానికి చెందిన వారైనందున, సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ అయిన దగ్గర నుంచీ సంఘ్ పరివారం, బిజెపి ఆయన్ని లక్ష్యంగా చేసుకొని వ్యతిరేక ప్రచారం లంకించుకున్నాయి. చీఫ్ జస్టిస్ బాధ్యతలు స్వీకరించాక మే నెలలో తొలిసారి స్వంత రాష్ట్రం ముంబరు పర్యటనకు వెళ్లినప్పుడు, అక్కడి బిజెపి ప్రభుత్వం కనీస ప్రొటోకాల్ పాటించకుండా ఘోరంగా అవమానపర్చింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపి, ముంబరు పోలీస్ కమిషనర్ వంటి ముఖ్య అధికారులు గవారు పర్యటనకు ఉద్దేశపూర్వకంగా డుమ్మాకొట్టారు. అనంతరం పొరపాటు జరిగిందని మహారాష్ట్ర సర్కార్ సుప్రీం కోర్టు ముందు తప్పు ఒప్పుకొని విచారం వ్యక్తం చేయాల్సి వచ్చింది. జస్టిస్ గవాయ్ తల్లిదండ్రులపై మహారాష్ట్రలో నిసంఘ్ పరివార్ మూకలు సోషల్‌మీడియాలో వ్యతిరేక ప్రచారం చేస్తుండటంపై వారు బహిరంగంగా నిరసన తెలియజేశారు. మహారాష్ట్రలోని అమరావతిలో నిర్వహించిన ఆర్ఎస్ఎస్ శతవార్షికోత్సవానికి రావాలన్న ఆహ్వానాన్ని తిరస్కరిస్తున్నట్లు గవాయ్ తల్లి ప్రకటించారు. బీహార్ ఓటర్ల సవరణ, గవర్నర్ల వ్యవహారశైలి తదితరాలపై గవాయ్ జారీ ఉత్తర్వుల నేపథ్యంలో రాజకీయ కారణాలు కూడా ఆయనపై దాడికి పురిగొల్పి ఉండవచ్చు. ఉద్దేశపూర్వకంగానే సంఘ్‌పరివారం, బిజెపి పగబట్టి వెంటబడి వేధిస్తున్నాయని అర్థమవుతుంది. ఎంతటి వారినైనా వదిలిపెట్టబోమన్న పరివార్ హెచ్చరికగా గవాయ్ పై దాడిని పరిగణించాలి. విభజన, విషపూరిత రాజకీయాల ప్రభావంతో సాగుతున్న విద్వేష చర్యలను అందరూ కలిసి సమర్థవంతంగా ఎదుర్కోవాలి.

# సరిహద్దులు దాటుతున్న సబ్సిడీ బియ్యం..!



జయశంకర్ భూపాలపల్లి.: ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన సన్నబియ్యం పథకం స్మగ్లర్లకు వరంలా మారింది. సబ్సిడీ బియ్యం సరిహద్దులు దాటుతున్న రాష్ట్ర సరిహద్దుల్లోని అధికారుల్లో చలనం లేదు. కాళ్ళు లేని బియ్యం స్మగ్లర్ యదేచ్ఛగా పేదల బియ్యంను లారీల్లో తరలిస్తున్న కండ్లున్న అధిక్షరులకు కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నింస్తున్నారు. పిడిఎస్‌రైస్ అక్రమ సరఫరాలో సమూల మార్పులు తీసుకొచ్చిన అక్రమ వ్యాపారం మాత్రం ఆగడం లేదు. పొరుగు రాష్ట్రాల్లో దొడ్డు బియ్యానికి ఎక్కువ డిమాండ్ ఉండడంతో ఇంతకాలం స్మగ్లర్లు ఇష్ట రాజ్యాంగా నడిపింది. అయితే రేషన్ షాపుల ద్వారా దొడ్డు బియ్యానికి బదులుగా సన్నబియ్యం సరఫరా చేసినట్లయితే లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుంటారని భావించింది రాష్ట్ర ప్రభుత్వం. ఇందులో భాగంగా సన్న బియ్యం సరఫరాచేయడం మొదలుపెట్టింది. ఆహార భద్రతల కార్డులు ఉన్నవారికి సన్న బియ్యం సరఫరా చేస్తుండడంతో అవి దారి మళ్లె అవకాశం ఉండదని వేసిన అంచనాలు మహారాష్ట్రకు చెందిన ఒక బడా అక్రమ రేషన్ బియ్యం వ్యాపారి తలకిందుల చేసి ప్రభుత్వాన్ని బురిడీ కొట్టించాడు. గతంలో 18రూపాయలకు కిలో చొప్పున దొడ్డుబియ్యం కొనుగోలు చేసిన అక్రమ వ్యాపారస్తులు సన్నబియాన్ని మాత్రం 24రూపాయల చొప్పున కొనుగోలు చేస్తున్నట్టుగా సమాచారం. సన్నబియ్యానికి పొరుగునే ఉన్న మహారాష్ట్రలో అంతగా డిమాండ్ లేనప్పటికీ తెలంగాణలోని రేషన్ షాపుల ద్వారా సరఫరా అవుతున్న బియ్యం మాత్రం నల్ల బజారుకుతరలిపోతూనే ఉన్నాయి, గతంలో 80నుండి 90శాతం దొడ్డు బియ్యం స్మగ్లర్ల ద్వారా రవాణా కాగా ఇప్పుడు 40 శాతం వరకు పిడిఎస్ రైస్ అక్రమ రమణా అవుతున్నట్టుగా సమాచారం. సన్న బియ్యం సరఫరా చేస్తున్నప్పటికీస్మగ్లింగ్ జరుగుతుందన్న సమాచారం అందుకున్న తెలంగాణసివిల్ సప్లై విజిలెన్స్ విభాగం అధికారులు మొదట్లో దాడులు చేశారు. రేషన్ దుకాణాలకు చేరాల్సిన సన్న బియ్యం కూడా దారి మల్లుతున్నాయని రెడ్ హ్యాండెడ్గా పట్టుకుని నిరూపించారు. అయితే ఆ తర్వాత విజిలెన్స్ అధికారులు దాడులు నామమాత్రం కావడంతో నెమ్మదిగా వ్యాపారులు సన్నబియ్యాన్ని కూడా కొనుగోలు చేసేందుకు తమ పావులు కదుపుతున్నారు. మహారాష్ట్రలోని గడ్చిరోని జిల్లా సిరోంచ తాలూకా కేంద్రానికి మంచిర్యాల జిల్లా చెన్నూరు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవ పూర్ ప్రాంతం మీదగా సన్న బియ్యం సరఫరా అవుతున్నట్టుగా ప్రచారం జరుగుతుంది. గతంలో మాదిరిగానే కమిషన్ ఏజెంట్లు ఏర్పాటు చేసుకున్న బడా వ్యాపారస్తుడు వారికి కిలోకు రెండు వరకు కమిషన్ ఇచ్చాడని తెలిసింది. రేషన్ షాపుల ద్వారా సరఫరా అవుతున్న సన్నబియ్యాన్ని సేకరించేందుకు సదరు వ్యాపారుల నెట్వర్క్ అన్ని గ్రామాల్లో పనిచేస్తున్నట్టుగా తెలుస్తోంది సరిహద్దులు గ్రామాలు చేరుకున్న రేషన్ బియ్యం గోదావరి నది దాటి సిరోంచకు తరిపోతున్నాయి,మహారాష్ట్రలోని వివిధ పట్టణాలలో బహిరంగ ంగా మార్కెట్లో విక్రయిస్తున్నట్లు సమాచారం ఆసిఫాబాద్ జిల్లాలోని ఓ ప్రాంతానికి కూడా రేషన్ బియ్యం సేకరిస్తున్నట్టుగా ప్రచారం జరుగుతుంది. మంచి ర్యాలీ ఆసిఫాబాద్ మార్గమధ్యలో ఓ రైల్వే స్టేషన్ సమీపంలో రేషన్ బియ్యంసేకరించి వ్యాపారులు దర్జాగా తమ దందా కొనసాగిస్తున్నారని ప్రచారంజరుగుతోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి రేషన్ బియ్యం ఈ ప్రాంతానికి చేరుతున్న తర్వాత వాటి సంచులు మార్చి బహిరంగ మార్కెట్లో 40 రూపాయల కిలో లేదా 45 రూపాయల కు విక్రయిస్తున్నట్టుగా సమాచారం, అయితే మహారాష్ట్రలోని సిరోంచకు తెలంగాణలోనీ మంచిర్యాల ఆసిఫాబాద్ రహదారిలోని రైల్వే స్టేషన్ సమీపంలో రెండు షెల్టర్లు పాయింట్లు కూడా ప్రధాన రహదారులుగా సమీపంలోఏర్పాటు చేసుకొని దందాకొనసాగిస్తున్నారని తెలిసింది.పిడిఎస్ రైస్ దందాల్లో పోలీసులు మామూల్లు అడుగుతున్నారని చేతులు తడపాలని డిమాండ్ చేస్తున్నారని వ్యాపారులు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించినట్లు సందర్భాలు ఉన్నాయి, లంచం ఇస్తూ పోలీసులుఅధికారులను రెడ్ హ్యాండెడ్గా రేషన్ బియ్యం స్మగ్లింగ్ చేస్తున్న వ్యాపారులు ఏసీబీ పట్టించిన సంఘటనలు ఉన్నాయి. వీటి ఆధారంగా సివిల్‌సప్లై విజిలెన్స్ విభాగం దర్యాప్తు ఎందుకు చేయడంలేదన్నది కూడా అంతుచిక్కకుండా పోతుంది. రేషన్ బియ్యం అంత పెద్ద మొత్తంలో ఎక్కడకు తరలిపోతున్నాయి. ఆ బియ్యాన్ని పోలీసులు ఏసీబీకి పట్టించిన వ్యాపారికి ఏంసంబంధం ఉంది. అసలు ఆవ్యాపారి ఆబియ్యాన్ని అంత పెద్ద మొత్తంలో సేకరించడానికి కారణం ఏంటి. అన్న సమగ్ర వివరాలు తెలుసుకొని సివిల్ సప్లై చట్టాలకు పని చెప్పినట్లయితే ప్రధానంగా సిరోంచ తాలూకా కేంద్రానికి చెందిన ఒక తెలుగు వ్యాపారి జీవితాంతం ఊసలు లెక్కపెట్టే కేసులు కూడా ఉన్నాయని సమాచారం.

# ఫ్రీ మార్కెట్ అభూత కల్పన

## ఇబ్బడిముబ్బడి దిగుబడులతో నష్టాలు ఆంక్షలు విధించుకుంటేనే పురోగతి

న్యూఢిల్లీ: ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. యూరియా కొరతతో రైతులు ఎంతగా ఇబ్బందులు పడుతున్నారో చూస్తున్నాం. ఇదంతాదూరదృష్టి లోపంగానే చూడాలి. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్న ప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. అవసరం లేకున్నా ఇబ్బడి ముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. సస్యవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన తరుణమిదేనని వ్యవసాయరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ప్రజలంతా మళ్లీ ఉపాధి వదులకుని గ్రామాలకు తరలారని, వారిని ఆదరించి వ్యవసాయం వైపు మళ్లించాలని అన్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయరంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిదని అంటున్నారు. తెలంగాణలో ఇలాంటియూనిట్లు పెట్టేవారిని ప్రోత్సహిం చాలని ప్రభుత్వం నిర్ణయించింది. బహుళజాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణంకాక మరోటి కాదు. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. ఇకపోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగామారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి సారం తగ్గుతోంది. ఏ పంట పండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. దీనికి తాజా ఉదాహరణ కంది, మిర్చి పంటలే. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందించాలి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. ఇతర దేశాల నుంచి ఆహార ధాన్యాల దిగుబడి తక్షణం ఆగిపోవాలని అన్నారు.

# కేసీఆర్ చాణుక్య వ్యూహాం..!



హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) ఒక అపార చాణక్యుడిలా గుర్తింపు పొందాడు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తర్వాత ప్రజలకు దూరంగా ఉంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన రెండేళ్లు పూర్తి అవుతున్న తరుణంలో కేసీఆర్ మళ్లీ యాక్టీవ్ అవుతున్నారు. ప్రజల్లోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ బలహీనతలను ఉపయోగించి పార్టీని బలోపేతం, పునర్నిర్మించడంపై దృష్టి పెట్టారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ గెలిచి అధికారంలోకి వచ్చే వ్యూహం రూపొందిస్తున్నారు. రేవంత్ రెడ్డి పాలనలో పెరిగిన అసంతృప్తి, ఇరిగేషన్ సమస్యలు, ఆర్థిక సంక్షోభాలు ఇవన్నీ కేసీఆర్ దీర్ఘకాలిక ఆలోచనలో భాగమే.2023 ఎన్నికల ఓటమి తర్వాత, కేసీఆర్ ఎర్ర వల్లి ఫామ్‌హౌస్‌లోకి వెళ్లిపోయారు. ఇది కేవలం ఆరోగ్య సమస్యలు లేదా డిమోరలైజేషన్ కాదు ఇది ఒక ఆచరణాత్మక మౌనం. రేవంత్ రెడ్డి'స్వయం నిర్బంధన' అని ఎగతాళి చేసినప్పటికీ, ఈ దూరం వారికి ప్రభుత్వ చర్యలను దగ్గరగా పరిశీలించే అవకాశాన్ని ఇచ్చింది. ఫలితంగా, కాంగ్రెస్ పాలనలోని లోపాలు రైతుల రుణమాఫీలో ఆలస్యం, రైతు బంధు చెల్లింపుల ఆలస్యం, హైడ్రా ద్వారా రియల్ ఎస్టేట్‌లో క్షీణత ఇవన్నీ బీఆర్ఎస్‌కు ఆయుధాలుగా మారాయి. ఈ మౌనం, పార్టీ క్యాడర్‌లో ఆందోళన కలిగించినప్పటికీ, కేసీఆర్‌కు 'తెలంగాణ బాపూ' ఇమేజ్‌ను పునరుద్ధరించే సమయాన్ని ఇచ్చింది. ఇటీవలి పోల్స్‌లో కూడా, ప్రజలు కేసీఆర్‌ను 'ఫామ్‌హౌస్' కంటే 'పబ్లిక్ గవర్నెన్స్'కు ప్రిఫర్ చేశారు, ఇది కాంగ్రెస్ స్వయంపోల్‌లో కూడా స్పష్టంగా కనిపించింది. బీఆర్ఎస్ పునరుద్ధరణకు కేసీఆర్ రూపొందించిన ప్లాన్, గ్రాస్‌రూట్ స్థాయిలో ప్రారంభమై, రాష్ట్రవ్యాప్త చర్చలతో ముగుస్తోంది. 2025 ఫిబ్రవరిలో పార్టీ సిల్వర్ జూబిలీ జరుపుతూ, వారు మెంబర్‌షిప్ డ్రైవ్‌ను ప్రారంభించారు, ఇది కేవలం సంఖ్యలు పెంచడం కాదు ప్రజల అసంతృప్తిని రాజకీయ ఊపందుకునేందుకు ఉద్దేశించినది. రైతు ఆత్మహత్యలు, ఆటో డ్రైవర్ల సమస్యలు, విద్యార్థుల అభ్యంతరాలు ఇవి పార్టీ సమావేశాల్లో చర్చనీయాంశాలుగా మారాయి. కేసీఆర్, 'కాంగ్రెస్ పాలనలో ప్రజలు బాధపడుతున్నారు, మేము వారి పక్షంలో నిలుస్తాం' అని ప్రకటించారు. కేటీఆర్,'మా తండ్రి సరైన సమయంలో రావడం తెలుసు' అని చెప్పడం, వారి కుటుంబ వ్యూహాన్ని సూచిస్తుంది కేసీఆర్ లీడర్‌షిప్‌లో, కేటీఆర్ యువతను టార్గెట్ చేస్తూ పార్టీని ముందుకు నడిపిస్తారు. ఇటీవలి డెఫెక్షన్లు (ఎమ్ఎల్ఏలు కాంగ్రెస్‌లోకి వెళ్లడం) కూడా బీఆర్ఎస్‌కు అనుకూలంగా మారవచ్చు బైఎలక్షన్లు జరిగితే, ప్రజలు 'కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్' మధ్య ఎంపిక చేస్తారని కేటీఆర్ ఛాలెంజ్ చేశారు.కేసీఆర్ వ్యూహంలో కీలకం, కాంగ్రెస్ పాలనలోని లోపాలనుహైలైట్ చేయడం. 420ప్రామిస్‌లలోచాలా ఇంకా అమలుకాలేదు రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు అసంతృప్తితో ముందుకు వస్తున్నారు.కలేశ్వరం ప్రాజెక్ట్ పంపులు ఆఫ్ చేయడం, యూరియా కొరత వంటి సమస్యలను ఎత్తి చూపారు. ఇది మాత్రమే కాదు, బీజేపీతో 'టాకిట్ అండర్‌స్టాండింగ్' ఆరోపణ లను ఎదుర్కొని, వారిని 'అంటీతెలంగాణ' గా చిత్రీకరిస్తున్నారు. ఫలితంగా, అంటీఇంకంబెన్సీ పెరుగుతోంది రియల్ ఎస్టేట్ క్షీణత, కన్‌స్ట్రక్షన్ ఆగిపోవడం వంటివి ప్రజల్లో కోపాన్ని మరింత పెంచుతున్నాయి. కేసీఆర్ ఈ అసంతృప్తిని ప్రజా ఉద్యమంగా మలిచి, 2026-28 మధ్య తిరిగి రావడానికి సిద్ధమవుతున్నారు.

# మహిళా ఓటు బ్యాంక్ పై కన్ను

రాజమండ్రి: ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మహిళా ఓటు బ్యాంకు ఎప్పటినుంచో కీలకపాత్ర పోషిస్తోంది. గత ఎన్నికల్లో వైసీపీ దీనిపై పెద్ద ఎత్తున ఆధారపడింది. ఆ సమయంలో దాదాపు 40 శాతం ఓట్లు ఆ పార్టీకి వచ్చాయి. అధికారంలోకి రాకపోయినా 11 సీట్లు మాత్రమే గెలుచుకున్నప్పటికీ ఓటు శాతంలో మాత్రం గణనీయమైన స్థాయిని సాధించింది. ఈ ఓటింగ్‌లో మహిళల శాతం 26 పైగానే ఉందని పార్టీవర్గాలు చెప్పాయి. అందువల్ల మహిళలుతమకు పూర్తిగా అండగా ఉన్నారని, వారు నిజంగా "మహిళా పార్టీ" అనిపించుకున్నామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పలు మార్లు ప్రస్తావించారు. కానీ 2024 ఎన్నికల తర్వాత పరిస్థితులు మెల్లగా మారుతున్నాయి. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పుడు మహిళల ఓటు బ్యాంకును ఆకర్షించే దిశగా వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్నారు. ఎన్నికల ముందు వాగ్దానం చేసిన పథకాలతో పాటు మరికొన్ని కొత్త పథకాలను ఆయన ప్రవేశపెట్టారు. ఇప్పటికే "సూపర్ సిక్స్" కింద ఆర్టీసీ లో మహిళలకు ఉచిత ప్రయాణం, "తల్లికి వందనం" పథకాలను అమలు చేస్తున్నారు. మరో రెండు ముఖ్యమైన పథకాలను మహిళలకు అంకితం చేయబోతున్నారని అధికార వర్గాల సమాచారం. అవి ఎన్టీఆర్ విద్యా లక్ష్మి, ఎన్టీఆర్ కళ్యాణ లక్ష్మి పథకాలు. విద్యాలక్ష్మి పథకం కింద బాలికలు తమ చదువును ఉన్నత స్థాయికి కొనసాగించేందుకు సులభ వడ్డీ రుణాలు పొందే అవకాశం ఉంటుంది. ఒక్కొక్కరికి లక్ష రూపాయల వరకు రుణం బ్యాంకుల ద్వారా అందించనున్నారు. వీటిని సులభమైన ఈఎంఐల రూపంలో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా పెళ్లి చేసుకునే యువతులకు కూడా ఒక్కొక్కరికి లక్ష రూపాయల రుణాన్ని అందజేయాలని నిర్ణయించారు.ఈ రెండు పథకాలు కూడా మధ్యతరగతి, పేద కుటుంబాల మహిళలకు ఉపయుక్తంగా మారుతాయని ప్రభుత్వం నమ్ముతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయం ప్రకారం ఈ పథకాలు మహిళా ఓటు బ్యాంకును మరింత బలపరుస్తాయి. వైసీపీ ఇప్పటి వరకు మహిళా ఓటర్లను తమ అంకిత భావంతోనే నిలుపుకుంటామనుకుంది. కానీ కొత్తగా వస్తున్న సంక్షేమ పథకాల వల్ల ఆ వ్యూహం తప్పిపోతుందేమోనన్న ఆందోళన వారికి పెరుగుతోంది.అసలైన పరీక్ష మాత్రం రాబోయే ఎన్నికలలోనే ఉంటుంది. మహిళలకు అందిస్తున్న ఈ సహాయాలు ఏ పార్టీకి లాభం చేకూరుస్తాయో, ఎవరికీ నష్టం కలిగిస్తాయో అనేది ఆ సమయానికే తేలుతుంది. కానీ ఇప్పటివరకైతే, మహిళల మద్దతు కోసం రెండు ప్రధాన పార్టీల మధ్య పోటీ మరింత ఉత్కంఠభరితంగా మారినట్టే కనిపిస్తోంది.

# అమ్మాయి చదువుకు రామన్ మెగసెసే!





ఎక్కడ పుట్టాం, ఎలాంటి పరిస్థితుల్లో పెరిగాం అన్నదానితో సంబంధం లేకుండా మనల్ని ఉన్నత స్థితిలో నిలిపే ఒకే ఒక్క సోపానం విద్య. అది ఉంటే చాలు మనలో ఎక్కడలేని ఆత్మవిశ్వాసం వస్తుంది, బతుకు మీద భరోసా లభిస్తుంది. ముఖ్యంగా తీవ్ర లింగవివక్షకు గురవుతున్న ఆడపిల్లల జీవితాల్లో ఇది ఎనలేని మార్పును తెస్తుంది. ఈ విషయాన్ని మనసారా నమ్మిన మనిషి దిల్లీకి చెందిన సఫీనా హుస్సేన్. 'ఎడ్యుకేట్ గర్ల్స్ ఎన్‌జీవో'ను స్థాపించి దాని ద్వారా భారత్‌లోని 20 లక్షల మందికిపైగా ఆడపిల్లలకు విద్యాసేవ చేశారు. అందుకుగాను ప్రఖ్యాత రామన్‌మెగసెసే పురస్కారం లభించిందా సంస్థకు. ఈ సందర్భంలో ఎన్‌జీవోతో పాటు, దాని వెనకున్న వ్యక్తుల గురించి కొన్ని విలువైన విశేషాలు..

ఒక దీపం మరో దీపాన్ని వెలిగించగలదన్న మాట ఎంత నిజమో, ఒక విద్యావంతుడు మరో విద్యావంతుడ్ని తీర్చిదిద్దగలడన్న మాటా అంతే సత్యం. అందుకే తాను శ్రమించి సంపాదించుకున్న చదువును పది మందికీ చేరువ చేసేందుకు పోరాటం చేయాలని నిశ్చయించుకుంది సఫీనా హుస్సేన్. దిల్లీలోని ఒక ఇరుకింట్లో నివసించేదామె కుటుంబం. ప్లస్‌టూ చదువు అయిపోయాక పెండ్లి చేద్దాం అని అనుకున్నారు ఇంట్లో వాళ్లు.

మూడు సంవత్సరాల పాటు ఆమె చదువుకు దూరం అయింది కూడా. కానీ, అదే సమయంలో బంధువు ఒకామె తనను చేరదీసింది. చదువు మీద ఎంతో మక్కువ ఉన్న సఫీనా ఆమె దన్నుతో ఏకంగా లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో చోటు దక్కించుకుంది. ప్రఖ్యాత విద్యాసంస్థ నుంచి పట్టా పుచ్చుకోవడంతో కార్పొరేట్ ఉద్యోగాలు వరుస కట్టాయి. కానీ, ఆమె మనసు అక్కడ స్థిమితంగా లేదు. భారత్‌కి తిరిగి వచ్చి తనలాంటి ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్న ఆడపిల్లల చదువుకు అండగా ఉండాలని 2007లో ఎడ్యుకేట్ గర్ల్స్ స్వచ్ఛంద సంస్థను నెలకొల్పింది.

లక్షల మందికి బాసట: ఆడపిల్లల చదువును ప్రోత్సహించేలా స్వచ్ఛంద సంస్థ స్థాపించాలనుకున్నప్పుడు దేశంలోని ఏయే రాష్ట్రాల్లో అత్యధికంగా బడి మానేస్తున్న పిల్లలు ఉన్నారన్న సర్వే చేశారు సఫీనా. దాని ఆధారంగా రాజస్థాన్‌లోని పాలి జిల్లాలో తన అవసరం ఎక్కువగా ఉందని గ్రహించి అక్కడి గ్రామాల్లో పనిచేయడం ప్రారంభించారు. ప్రస్తుతం రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లోని 30,000 గ్రామాల్లో ఈ సంస్థ సేవలందిస్తున్నది. ప్రతి ఊరు లేదా ప్రాంతంలో 'టీమ్ బాలిక' పేరుతో వలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చేస్తారు. వాళ్లు ప్రభుత్వం, ఇతర స్థానిక సంస్థలతో కలిసి పనిచేస్తూ ప్రతి ఇంటిలోనూ బడి ఈడు పిల్లల్ని గుర్తించి వాళ్ల ఇండ్లకు వెళ్లి మాట్లాడతారు. కుటుంబ సభ్యుల్లో స్ఫూర్తి నింపి సమస్యల్ని పరిష్కరించే ప్రయత్నం చేసి తిరిగి బడిలో చేరేలా కృషి చేస్తారు. సంస్థకు ఇలాంటి 23 వేల టీమ్‌లు ఉన్నాయి.

ఇప్పటి దాకా 20 లక్షల మందికి పైగా ఆడ పిల్లలు వీళ్ల ద్వారా బడిబాట పట్టారు. మధ్యలో చదువు ఆపేసిన పెద్ద వాళ్లతోనూ పది పరీక్షలు రాయించి, వృత్తి విద్యా కోర్సుల్లో చేర్పించి, చిన్న స్థాయి ఉద్యోగాలు వచ్చేలానూ చూస్తారు. ఇలా దాదాపు 24 లక్షల మందికి సాయం చేసింది ఎడ్యుకేట్ గర్ల్స్. 'చదువు ఎంతో మంది ఆడపిల్లల జీవితాల్లో అత్యుత్తమ మార్పుల్ని తెచ్చిందనీ, ఇలా తమ ద్వారా తిరిగి పుస్తకం పట్టుకునే వారి సంఖ్య కోటి దాటాలన్నదే లక్ష్యమనీ, తమ కృషికి మెగసెసే పురస్కారం లభించడం చెప్పలేనంత ఆనందాన్నిచ్చిందనీ' అంటున్నారు సఫీనా.

# చీరతో పట్టేసే చేప పిల్లలకు భలే డిమాండ్!

కాకినాడ: గోదావరి జిల్లాలో పులసకు ఉన్న క్రేజ్ ఎంతో అందరికీ తెలిసిన విషయమే.. కానీ ఇంచుమించు ఈ సీజన్‌లో అంతే క్రేజ్ ఉన్న గోదావరి వంటకం చీరమేను..చీరతో వేటాడే ఈ చేపపిల్లల టేస్ట్ గురించి మాంస ప్రియులు చాలా గొప్పగా చెబుతారు.. గోదావరిలో లభ్యమయ్యే ఈచీరమేను రేటు కూడా అంతేస్థాయిలో కూడా ఉంటుంది.. ఎందుకంటే ఇది అరుదుగా దొరికే సీజనల్ చీరమేను కావడం దీనికి ప్రధాన కారణం కూడా.. పూర్వ కాలంలో శేరు, తవ్వ, సోల కింద కొలిచి అమ్మే ఈ చీరమేను ఇప్పుడు కిలోల లెక్కన అమ్మకాలు సాగిస్తున్నారు.. ఒక కిలో చీరమేను రూ.3000 నుంచి రూ.4000 వరకు విక్రయాలు జరుగుతుండగా పావుకిలో చొప్పున కూడా అమ్మకాలు చేస్తుంటారు స్థానికంగా ఉన్న మత్స్యకారులు.. తాజాగా చీరమేను సీజన్ కావడంతో పుదుచ్చేరీ యానం మార్కెట్‌లో చీరమేను ను కొనేందుకు ఎగబడుతున్నారు నాన్ విజిటేరియన్స్...గోదావరిలో చీరమేను అరుదుగా దొరుకుతుంది కాబట్టే దీనికి ఇంత ధర పలుకుతుం దంటుంటారు చీరమేను గురించి తెలిసిన వారు.. గోదావరి ప్రవాహం ఓ వైపు, గోదావరిపై వీచే శీతల చల్లగాలులు మరోవైపు ఈ ప్రభావానికి దొందు జాతికి చెందిన చేపపిల్లలు సమూ హంగా నీటి ఉపరితలంపై నురగలాతేలుతూ కదులుతుంటాయి.. నీటిఅలల తాకిడికి నురగ కూడా తోడవ్వడంతో ఈసమూహాన్ని గుర్తించడం మత్స్యకారులకు చాలా తేలిక అవుతుంది.ఈ సమూహం కదలికను ముగ్గురు కలిసి చీరతో అడ్డుకుని పట్టుకుంటారు.. ఇది గట్టుపైకి తీసుకువచ్చి నీళ్లల్లో కడిగి బకెట్లలోఉంచుతారు.. వలకు చిక్కని చిన్న చేపపిల్లలు కావడం, సమూ హంగా కదలడంతో వలకు చిక్కవు గనుక ఈ చేపపిల్లలను చీరతో మాత్రమే పట్టుకునేందుకు వీలవుతుంది.. అందుకే వీటికి చీరమేను అనే పేరు



వచ్చిందంటారు.. అయితే ఇప్పుడు సీడ్ నెట్ అందుబాటులో ఉండడంతో వీటితోనే చీరమేనును పట్టుకుంటున్నారు.గోదావరిలో అరుదుగాదొరికే ఈ సీజనల్ చీరమేను కోసంమాంస ప్రియులు ఎందు కు అంతగా ఎగబడతారు అంటే వీటితో చేసిన వంటకాలు అంత రుచిగా ఉంటాయని చెబుతుంటారు.. చీరమేను చింతకాయ పులుసు, చీరమేను మసాలా కూర, చీరమేనుతో కలిపి వేసిన గారెలు అబ్బో ఆ టేస్టే వేరే లెవెల్ అంటుంటారు గోదావరి ప్రజలు.. ప్రస్తుతం చీరమేను యానాం చేపలమార్కెట్‌లో దొరుకుతోంది.. ధవళేశ్వరం, అంతర్వేది, ఓడలరేవు ఇలా చాలా ప్రాంతాల్లో ఈ చీరమేను లభ్యం అవుతోంది.. కొంతమంది కిలోల లెక్కన విక్రయాలు చేస్తుండగా కొంత మంది కొలతల ప్రకారం అంటే శేరు, తవ్వ,సోల ప్రకారం కొలిచి అమ్ముతు న్నారు.

# ముష్తాక్‌పై విమర్శలేల..?




ఈ ఏడాది మైసూర్ దసరా ఉత్సవాలను ప్రముఖ రచయిత్రి, బుకర్ ప్రైజ్ విజేత బాను ముష్తాక్ ప్రారంభించారు. ఈ ఉత్సవాలను ఓ ముస్లిం మహిళ ప్రారంభించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఇది నచ్చని బిజెపి నేతలు%ొ%అసలు హిందూయేతరులను పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు అనుమతించడమేంటని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. చారిత్రకంగా చూసుకున్నా ప్రతిష్టాత్మక మైసూర్ దసరా ఉత్సవాల్లో హిందువులతోపాటు ముస్లింలు భాగస్వాములయ్యారని తెలుస్తోంది. 2017లో కన్నడ రచయిత, పద్మశ్రీ అవార్డు గ్రహీత కె.ఎస్. నిసార్ అహ్మద్ ఈ ఉత్సవాలను ప్రారంభించారు. కాని బిజెపి నేతలు ఆయనను విమర్శించడం లేదు. మరిప్పుడెందుకు బాను ముష్తాక్‌ను టార్గెట్ చేశారు బ్రాహ్మణ ఆధిపత్యాన్ని, హిందూ సంప్రదాయాలను ఆమె ప్రశ్నించారు. సనాతన ధర్మాన్ని భుజానికెత్తుకోనందువల్లే ఆమెను అడ్డుకోవాలనుకున్నారు. పోనీ హిందు మహిళల్ని బిజెపి ఏమన్నా గౌరవంగా చూస్తుందా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును నూతన పార్లమెంటు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆహ్వానించలేదు. కేవలం ప్రధాని మోడీనే ఆ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బాబ్రీమసీదు కూల్చివేసి రామ మందిరాన్ని కట్టించిన రాష్ట్రంలో శ్రీరామనవమి సందర్భంగా మత సామరస్యం వెల్లివిరుస్తోంది. వారణాసిలో జరిగే శ్రీరామనవమి వేడుకల్లో ముస్లిం మహిళలు హారతులిస్తారు. అలాగే మహారాష్ట్రలో సాంగ్లీ జిల్లాలోని గొట్టిండీ గ్రామంలోని మసీదులో వినాయకుని విగ్రహాన్ని పెట్టి పూజలు చేస్తారు. ఇలా 45 సంవత్సరాల నుంచి అక్కడ వినాయకుడి పూజా కార్యక్రమాల్ని ముస్లింలే నిర్వహిస్తున్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో లేని అడ్డంకులు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లోనే ఎందుకు బాను ముష్తాక్ దసరా ఉత్సవాలను ప్రారంభించకూడదని బిజెపి మద్దతుదారు హెచ్ఎస్ గౌరవ్ వేసిన పిటిషన్‌ను%ొ%రాజ్యాంగ విలువలను, వాటి ఆదర్శాలను పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు కొట్టివేయడం ఊరట కలిగించే అంశం.

# ఆ లేడీ ఆఫీసర్ వయిలెంట్!

అనంతపురం: సత్యసాయి జిల్లా పుట్టపర్తి ఆర్డీవో సువర్ణపై మూకుమ్మడిగా కలెక్టర్‌కు కంప్లైంట్ ఇచ్చారు వీఆర్వోలు. ఆధార్ అప్డేట్ విషయంలో వెనకబడ్డారంటూ వీఆర్వోతో గుంజీలు తీయించారంటూఫిర్యాదు చేశారు. పుట్టపర్తిఆర్డీవో కార్యాలయంలో ఆధార్ అప్డేషన్‌పై వీఆర్వోలకు ప్రత్యేక శిక్షణ ప్రోగ్రామ్ జరిగింది. ఈ ట్రైనింగ్ సెషన్‌లో ఒడిసి మండలం వీఆర్వోపై మండిపడ్డారు ఆర్డీవో సువర్ణ. ఆధార్ అప్డేట్‌లో బాగా వెనకబడ్డారంటూ ఫైర్ అయ్యారు. ఆర్డీవో సువర్ణ అడిగిన ప్రశ్నలకు వీఆర్వో సమాధానం ఇచ్చాడు. ఆధార్ అప్డేషన్ జరగకపోవడానికి కారణాలను వివరించాడు. చాలామంది బెంగళూరుకు వలస వెళ్లారని.. వాళ్లు వచ్చేంతవరకూ ఆధార్ అప్డేషన్ చేయలేమంటూ ఆర్డీవోకి సమాధానం ఇచ్చాడు వీఆర్వో.. అంతే,ఆర్డీవో సువర్ణకు సర్రున కోపమొచ్చింది. ఎప్పుడూ ఒకే కారణం చెబుతూ తప్పించుకుంటావా అంటూ సువర్ణ మం డిపడ్డారు..అంతటితో ఆగకుండా, ఆధార్ అప్డేషన్‌లో వెనకబడినందుకు గుంజీలు తీయాలంటూ ఆర్డీవో సువర్ణ ఆదేశించారు. ఆర్డీవో ఆర్డర్ వేయడంతో చేసేదేమీలేక.. మిగతా వీఆర్వోల ముందే గుంజీలు తీశాడు. దాంతో, అక్కడున్న వీఆర్వోలందరూ ఆర్డీవో సువర్ణపై ఎదురుతిరిగారు. ఏంటీ నియంతృత్వ పోకడ అంటూ ఆమెతో వాగ్వాదానికి దిగారు. గుంజీలు తీయించడం సరికాదంటూ ఆర్డీవోకు సూచించారు. గుంజీలు తీయించడం ఆపాలని విజ్ఞప్తిచేశారు.ఎంత విన్నవించుకున్నా, ఎంతమంది చెప్పినా వినకుండా వీఆర్వోతో గుంజీలు తీయించారు ఆర్డీవో. దాంతో, ఈ ఘటనపైజిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు వీఆర్వోలు. తమను అవమానించారంటూ ఆర్డీవో సువర్ణపై కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు.మొత్తంఘటనపై విచారణ జరిపి, ఆర్డీవో సువర్ణపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు వీఆర్వోలు..

# శిథిలావస్థకు నిజాంసాగర్..?

నిజామాబాద్: కామారెడ్డి జిల్లాలోని అతి పురాతనమైన నిజాంసాగర్ ప్రాజెక్టు భద్రతపై నీలి మేఘాలు కమ్ముకుంటున్నాయి. 100 సంవత్సరాల క్రితం నిజాం కాలంలో నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు కు సరియైన మరమ్మత్తులు లేని కారణంగా శిథిలావస్థకు చేరే పరిస్థితి దాపురించింది. ప్రాజెక్టుపై గుంతలు పడిన అధికారులు పట్టించుకోవడం లేదు. భారీ వర్షాలు కురవడంతో పాటు భారీ వరద ప్రాజెక్టు లోకి వచ్చి చేరుతుండడంతో చిన్న చిన్న గుంతలు పెద్ద గుంతలుగా మారి ప్రాజెక్టు కట్ట పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నూతన ప్రాజెక్టులనిర్మాణంపై ఉన్న శ్రద్ధ నిజాం కాలంలో నిర్మించిన 100 సంవత్సరాలు పూర్తయిన నిజాంసాగర్ ప్రాజెక్టును కాపాడుకోవడంలో అధికారులు, పాలకులకు భద్రతపై చిత్తశుద్ధి లేదనేది జగమెరిగిన సత్యం. గత నెల రోజుల నుండి నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తుండడంతో తరచూ వరద గేట్లు మోరాయిస్తున్నాయి. దానికి తోడు ప్రాజెక్టు కట్టపై ఉన్న రిటైనింగ్ వాల్ పక్కన రోడ్డుపై మోకాళ్ళోదు గుంతలు ఏర్పడడంతో ప్రాజెక్ట్ భద్రతపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మోకాలులోది గుంతలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న సంబంధిత అధికారులకు పట్టనట్లు కనిపిస్తోంది. పురాతన ప్రాజెక్టుపై చిన్నపాటి గుంతలు ఏర్పడ్డ ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాల్సిన అవసరం



ఉన్న ఇవేమీ తమకు పట్టనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. గతంలో నిజాంసాగర్ ప్రాజెక్టు పరిధిలో సిబ్బంది తక్కువ ఉండడంతో సరియైన మరమ్మత్తులు చేయలేదు.

ఇప్పుడు గతంలో పనిచేసిన గ్రామ సేవకులను నీటిపారుదల శాఖలో విధుల్లోకి తీసుకోవడంతో సరిపడా సిబ్బంది ఉన్నారు. సిబ్బంది ఉన్న తాత్కాలిక మరమ్మత్తు పనులు చేయడంలో ఇబ్బంది ఏమిటనేది అధికారులకే తెలియాలి. చిన్నపాటి మరమ్మత్తుల సైతం నిర్లక్ష్యం చేస్తూ పోతే పెద్ద ప్రమాదం ఏర్పడే అవకాశాలు లేకపోలేదు. ఇకనైనా నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి నిజాంసాగర్ ప్రాజెక్టుపై ఏర్పడిన గుంతలను పూడ్చి ప్రాజెక్టు భద్రతను కాపాడుతారో లేదో వేచి చూడాల్సిందే.

## ఆ పది రాష్ట్రాలకే

# సంపన్నులు పరిమితం..

**- అక్కడే అభివృద్ధి కేంద్రీకృతం**

**- మిగిలిన భారతావనిలో అన్నీ సమస్యలే**

**- దేశంలో పెరిగిపోతున్న అంతరాలు**




న్యూఢిల్లీ : దేశంలో 1,687 మందికి వెయ్యి కోట్ల రూపాయలకు పైగా సంపద ఉంది. అలాగే 358 మంది వద్ద ఎనిమిదిన్నర వేల కోట్ల సంపద పోగుపడి ఉంది. వీరందరి వద్ద కలిపి ఉన్న సంపద భారత జీడీపీలో దాదాపు సగానికి సమానమని హురన్ ఇండియా రిచ్ తాజా జాబితా తెలిపింది. ఈ గణాంకాలు దేశానికి గర్వకారణమ ని అనిపిస్తోంది కదూ ! కానీ నాణేనికి మరో వైపు కూడా చూస్తే చేదునిజాలు బయటపడతాయి. కనిపిస్తున్న సుందర దృశ్యం అదృశ్య మవుతుంది. ఈ సంపద అంతా దాదాపుగా దేశంలోని కొన్ని ప్రాంతా లలోనే కన్పిస్తుంది. భారతదేశానికి చెందిన మిలియనీర్ కుటుంబాల లో సగానికి పైగా కుటుంబాలు మహారాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడు, కర్నాటక, గుజరాత్‌లోనే ఉండడం గమనార్హం. తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా.. వీటిని కూడా కలుపుకుం టే భారత వృద్ధిలో 90శాతం ఈ పది రాష్ట్రాలలోనే మనకు కన్పిస్తుంది. మరో మాటలో చెప్పాలంటే ముంబయి, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, అహ్మదాబాద్ నగరాలలోనే సంపద సృష్టి జరుగుతోంది. మిగిలిన ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నాయి. హురన్ నివేదికను పరిశీలిస్తే పరస్పర విరుద్ధమైన అంశాలు ఎన్నో కన్పిస్తాయి. అది కేవలం సంపన్నుల జాబితా మాత్రమే కాదు. దేశంలో అభివృద్ధి ఎక్కడ కేంద్రీకృతమైంది, అది ఇంకా ఎక్కడ కన్పించడం లేదు అనే అంశాలను కూడా ఆ నివేదిక స్పృశించింది. కొన్ని రాష్ట్రాలలోనేఎందుకు కేంద్రీకృతం?: సంపద ఎక్కడఉంటే అక్కడ అవకాశాలు లభిస్తాయని చెబుతుంటారు. మహారాష్ట్రలో వాణిజ్య రాజధాని ముంబయి ఉంది. ఆ రాష్ట్రంలో వెయ్యి కోట్ల రూపాయలకు పైగా సంపద ఉన్న వారు 548 మంది. అంటే దేశంలో ఉన్న సంపన్ను ల్లో సగం మంది మహారాష్ట్రలోనే ఉన్నారన్న మాట. ఢిల్లీలో 223 మంది సంపన్నులు ఉండగా కర్నాటక, గుజరాత్, తమిళనాడు, తెలం గాణలో మిగిలిన వారు నివసిస్తున్నారు. దీనిని బట్టి అర్థమవుతున్న విషయం ఏమిటంటే ఎక్కడ డబ్బు ఉంటే అక్కడ వ్యాపారం అభివృద్ధి చెందుతుంది. మౌలిక సదుపాయాలు ఉంటాయి. పెట్టుబడిదారులకు విశ్వాసం కలుగుతుంది. ముంబయి లేదా బెంగళూరులో వ్యాపారం ప్రారంభించాలని అనుకుంటే పెట్టుబడిని సమీకరించడం సులభం. నిపుణులైన సిబ్బంది లభిస్తారు. డబ్బు ఖర్చు చేసే వినియోగదదారులూ దొరుకుతారు. అదే ఇండోర్‌లోనో పాట్నాలోనూ వ్యాపారం చేస్తే అభివృద్ధి చెందడానికి చాలా కాలం పడుతుంది. ఏం తయారు చేస్తున్నామన్న దాని కంటే ఎక్కడ తయారు చేస్తున్నామన్నదే ముఖ్యమని ఓ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ యజమాని వ్యాఖ్యానించారు.

# “హ్యాండ్” ఇస్తారా అండగా నిలబడతారా..?

హైదరాబాద్: తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై జనాభిప్రాయం తెలిపే ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీ పరిస్థితి, ప్రభుత్వ పనితీరుపై ప్రజలు ఏమనుకుంటున్నారన్న దానిపైనే స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు తేల్చి చెప్పబోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికే రెండేళ్లు దాటి పోయింది. ఈ రెండేళ్లలో ఒకే ఒక ఉప ఎన్నిక జరిగింది. కంటోన్మెంట్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో విజయం సాధించినప్పటికీ అది అధికారంలో ఉన్న పార్టీపై ప్రజలు మొగ్గు చూపారని అనుకోవాలి. కానీ నేడు అలా కాదు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్నాయి. పల్లెలు, పట్టణాలలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకో నున్నారు. అయితే ఈ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతిష్టాత్మక మని చెప్పాలి. ఎందుకంటే ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంతో పాటు ఇచ్చిన హామీలను ఏ మేరకు అమలు జరిపారన్న దానిపైనే ఈ ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేసే అవకాశముంది. ప్రధానంగా రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా పథకాన్నిఅమలు చేసినప్పటికీ యూరియా కొరత కొంత రైతుల్లో అసంతృప్తి ఉంది. మరొకవైపు ఉద్యోగ నోటిఫికేషన్లు కూడా ఈ ప్రభుత్వంలో బాగానే విడుదలయ్యాయి. అయినా నిరుద్యోగ యువతలో ఎంత మేరకు అసంతృప్తి ఉందన్నది ఈ ఎన్నికల ఫలితాల ద్వారా స్పష్టమవుతుందిఇక ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ కార్డులను పంపిణీ చేసింది. ఇది తమకు పాజిటివ్ గా ఓటింగ్ ఉంటుందని కాంగ్రెస్ నేతలు అంచనా వేసుకుంటున్నారు. మరొకవైపు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కూడా ఒకరకంగా తమకు అనుకూలంగా మారతాయని భావిస్తున్నారు. అయితే ఇచ్చిన హామీలు ఎంతమందికి అమలయ్యాయి ఎంత మంది లబ్ది పొందారు గత ప్రభుత్వం లో లబ్ది పొందిన వారితో పాటు ఈ ప్రభుత్వంలో మరికొంత మంది ప్రయోజనం పొందారా లేక కోత విధించారా అనేది ఫలితాలను బట్టి వెల్లడవుతుంది. గత ప్రభుత్వంలో కల్యాణ లక్ష్మి పథకం అమలయ్యేది. ఇలా కొన్ని హామీలను అమలు చేయకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు వెళుతుంది. మరి ప్రజలు హ్యాండ్ ఇస్తారా కాంగ్రెస్ కు అండగా నిలబడతారా అన్నదిఎన్నికల ఫలితాల మాత్రమే తెలియనుంది.రాష్ట్రంలోని 5,749 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. అలాగే 12,733 పంచయతీలకు, 1,12,288 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి.తెలంగాణలో నేటి నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేసింది. తెలంగాణలోని 31 జిల్లాల్లోని 565 మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు 1.12 లక్షల పోలింగ్ స్టేషన్లను గుర్తించా రు. తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నా యి. ఎంపీటీసీ, జడ్పీటీసీ తొలి విడత పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 27న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల రెండో విడత పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 31 న తొలి విడత పోలింగ్ జరగనుంది. పంచాయతీలకు రెండో విడత పోలింగ్ నవంబరు నాలుగో తేదీన, మూడో విడత నవంబరు 8వ తేదీన నిర్వహించనున్నారు. పోలింత్ పూర్తయిన తర్వాత అదే రోజు గ్రామ పంచాయతీల ఓట్ల లెక్కింపు జరుగుతుంది. నవంబరు 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ జరగనుంది.

# మధురవనం దోపిడీ..!

నల్గొండ: అది కొండమల్లేపల్లిలోని మండలంలోని కోల్‌ముంతల్‌పహాడ్ గ్రామం. పైగా హైదరాబాద్– నాగార్జునసాగర్ హైవే. ఇంకేముందీ పచ్చని భూముల్ని వెంచర్లుగా మార్చేసి.. రంగురంగుల బ్రోచర్లతో కస్టమర్లను బురిడీ కొట్టించి.. ఆఫర్ల పేరుతో ప్లాట్లను అంటగడుతున్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రానికి కూతవేటు దూరంలో విజన్ ఇన్‌ఫ్రా డవలపర్స్ భారీ ఫామ్ లాండ్ దందాకు తెరలేపింది.మధురవనం పేరుతో ఏకంగా 243 ఫామ్ ల్యాండ్ ప్లాట్లను వెంచర్‌గా చేసి విక్రయాలను మొదలుపెట్టింది. అయితే సదరు వెంచర్ ఏర్పాటుకు కనీస అనుమతులు లేకపోవడం గమనార్హం. అయితే ఈ ఫామ్ ల్యాండ్ అక్రమ దందాకు రెవెన్యూ యంత్రాంగం వంతపాడుతుండడం కొసమెరుపు. వ్యవసాయ భూమిని గుంటల్లో రిజిస్ట్రేషన్ చేసేందుకు కొండమల్లేపల్లి తహసీల్దార్ కార్యాలయం వేదిక అయ్యింది. ఇంత జరుగుతున్నా.. జిల్లా రెవెన్యూ యంత్రాంగం మొద్దు నిద్రను వీడడం లేదు.కొండమల్లేపల్లి మండలంలోని కోల్‌ముంతల్‌పహాడ్ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 89,90,92,93ల్లో విజన్ ఇన్‌ఫ్రా డవలపర్స్‌ఆధ్వర్యంలో మధురవనం పేరుఫ్యామ్ ల్యాండ్ వెంచర్ ఏర్పాటయ్యింది. ఈ వెంచర్‌లో ఒక గుంట దగ్గరి నుంచి మొదలు పెడితే.. ఐదారుగుంటల వరకు గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. నిజానికి డీటీసీపీ, రేరా వంటి అనుమతులేవి లేకుండానే ఫామ్‌ల్యాండ్ ప్లాట్ల విక్రయాలు జోరందుకున్నాయి. అయితే సదరు వెంచర్ యాజమాన్యం ఇందులో కొత్త తరహా దందాకు తెరలేపింది. రిజిస్ట్రేషన్లు గుంటల్లో చేస్తున్నప్పటికీ.. అమ్మకాలు మాత్రం గజాల లెక్కన డబ్బులు దండుకుంటుండడం గమనార్హం. అయితే ప్రతి ఆదివారం స్పెషల్ ఆఫర్ పేరుతో కస్టమర్లను వెంచర్ వద్దకు తీసుకొచ్చి నాన్‌వెజ్ భోజనం.. రంగురం గుల బ్రోచర్లతో బురిడీ కొట్టించి ప్లాట్లను అంటగట్టేస్తున్నారు.పైగా హైదరాబాద్– నాగార్జునసాగర్‌హైవే కావడంతో హైదరాబాద్ మహానగరంతో పాటు మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లా కేంద్రాల నుంచి సైతం కస్టమర్లను కార్లలో తరలించి ప్లాట్లు కొనుగోలు చేసేలా మాయమాటలు చెబుతుండడం కొసమెరుపు.హైదరాబాద్– నాగార్జునసాగర్ హైవేదే భవిష్యత్ అంతా.. ఫ్యూచర్‌లో ఇక్కడ సైతం ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ వంటివి రాబోతున్నాయి. హైదరాబాద్ చుట్టూ పక్కలా భూమి అయిపోయింది. ఇక మిగిలింది ఈ హైవేకే. పైగా నాగార్జునసాగర్ ప్రాజెక్టును హైదరాబాద్ మహానగరం భవిష్యత్‌లో పర్యాటకంగా కలిసిపోయే పరిస్థితి వస్తుందంటూ కస్టమర్లను గాలిలోనే మేడలు కట్టేలాచేస్తున్నారు.వాస్తవానికి సగటు సామాన్యుడు భవిష్యత్ అవసరాల కోసం.. పిల్లల ఫ్యూచర్ కోసం మాత్రమే ప్లాట్లను కొనుగోలు చేస్తుంటారు. ఆ అవకాశాన్ని ఆసరాగా చేసుకుని కస్టమర్లు ప్లాట్లు బుక్ చేసేవరకు వదలడం లేదు.ఈ దందాలో ఏజెంట్లు, దళారులకు భారీగా కమిషన్లు ఇస్తుండడంతో ప్రైవేటు ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఇదే పనిచేస్తూ తొటి ఉద్యోగులు, బంధువులు, స్నేహితులకు అక్రమ ప్లాట్లను అంటగడుతున్నారు. తీరా ఆ ఫాట్లలో ఇల్లు కట్టుకోవాలంటే.. మస్తు తిప్పలు పడాల్సి వస్తుంది.

# సినిమా..

## స్టైలిష్ ఫోటోషూట్‌తో చిరంజీవి



టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి మరోసారి తన ఎనర్జీతో, స్టైలిష్ లుక్స్‌తో అభిమానులను అబ్బురపరిచారు. ఇటీవల రవి స్టూడియోస్ వారి ఆధ్వర్యంలో ఆయన ఇంట్లో నిర్వహించిన ఫోటోషూట్ లో చిరంజీవి మార్చిన ఐదు నుంచి ఆరు కాస్ట్యూమ్స్‌కి సంబంధించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. 70 ఏళ్ల వయసులోనూ చిరు ఇంత యంగ్ లుక్ లో కనిపించడం చూసి నెటిజన్లు ఆశ్చర్యంతో.. 70 ఏళ్ల వయసులోను 40 ఏళ్ల కుర్రాడిలా అదరగొట్టేస్తున్నారు అని కామెంట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పర్యావరణ పరిస్థితులు, ఆహారపు అలవాట్లు, కాలుష్యం వంటివి మన ఆరోగ్యాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తున్న ఈ రోజుల్లో చిరంజీవిలాంటి హీరోలు చూపిస్తున్న ఫిట్‌నెస్ నిజంగా స్ఫూర్తిదాయకం. ఇది దేవుని వరమో లేకుంటే, ఫిట్‌నెస్ పట్ల పట్టుదల ఫలితమో కాని, ఆయనలోని స్టైల్, గ్రేస్ మాత్రం అసలే తగ్గడం లేదు. ఇటీవల 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రంలోని "మీసాల పిల్ల" పాట ప్రోమోలో చిరంజీవి స్టైలింగ్ పై కొంత మంది విమర్శలు చేశారు. అయితే తాజా ఫోటోషూట్ ద్వారా చిరు అటువంటి కామెంట్లకు స్టైలిష్‌గా సమాధానం ఇచ్చినట్లే భావిస్తున్నారు అభిమానులు. ఇక ఈ ఫోటోలు చూస్తే చాలు, ఏం హ్యాండ్సమ్, ఏం ఛరీష్మా అన్న ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. 'భోళా శంకర్' సినిమా తర్వాత చిరంజీవి కొంత గ్యాప్ తీసుకున్నారు. కానీ 2025లో ఆయన బిజీ బిజీగా ఉన్నారు. జనవరిలో 'మన శంకరవరప్రసాద్ గారు' థియేటర్లకు రాబోతుండగా, ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. వేసవిలో 'విశ్వంభర' ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. డైరెక్టర్ బాబీ తో ఒక పవర్‌ఫుల్ యాక్షన్ మూవీ కూడా డిసెంబరు లేదా జనవరిలో సెట్స్ పైకి వెళ్లనుంది. అంతేకాదు, డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల తో ఓ వయలెంట్ డ్రామా చేయనుండగా, ఇందులో చిరంజీవి సరికొత్త మేకోవర్‌లో కనిపించనున్నారు. ఇవి కాకుండా మరో రెండు, మూడు ప్రాజెక్టులు చర్చల దశలో ఉన్నట్లు తెలుస్తోంది. 70 ఏళ్ల వయసులోనూ చిరంజీవి చూపిస్తున్న స్టైల్, డెడికేషన్ యువతకు ప్రేరణగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.. "వయసు ఓ సంఖ్య మాత్రమే" అనే మాటకు చిరంజీవి ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచారు.




## అఖండ 2 సినిమాపై హ్యూజ్ బజ్..!

నందమూరి బాలకృష్ణ బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న అఖండ 2 సినిమా అసలైతే సెప్టెంబర్ 25న రిలీజ్ లాక్ చేసుకున్నారు. టీజర్‌తోనే సినిమాపై హ్యూజ్ బజ్ ఏర్పడేలా చేశారు మేకర్స్. సినిమాలో బాలయ్య మాస్ విధ్వంసంతో రికార్డులచెడుగుడు ఆడేస్తాడని అంటున్నారు. సం యుక్త మీనన్, ప్రగ్యా జైశ్వాల్ హీరోయిన్స్ గా నటిస్తున్న అఖండ 2కి మరోసారి థమన్ తన మాస్ డ్యూటీ చేస్తున్నాడట. అఖండ 2 సినిమాను దసరాకి రిలీజ్ ఫిక్స్ అనుకున్నా రు. కానీ సినిమా పాన్ ఇండియా వైడ్ రిలీజ్ చేసే క్రమంలో వి.ఎఫ్.ఎక్స్ వర్క్ ఇంకాస్త బాగా చేయాలని ఆలోచిస్తున్నారట. అందుకే హ్రి బ్రి అన్నట్టు కాకుండా సినిమాను అనుకున్న విధంగా అవుట్ పుట్ వచ్చే వరకు చేయాలని చూస్తున్నారు.

ఈ క్రమంలో అనుకున్న సెప్టెంబర్ 25 రిలీజ్ డేట్ కూడా మారే అవకాశాలు ఉన్నాయట. ఐతే అఫీషియల్‌గా చిత్ర యూనిట్ ఆ విషయాన్ని అనౌన్స్ చేయలేదు. ఐతే దసరా కి అదే సెప్టెంబర్ 25కి ఆల్రెడీ పవర్ స్టార్ పవన్ కళ్యా ణ్ ఓజీ సినిమా రిలీజ్ ఫిక్స్ చేశారు. ఓజీ సినిమాను సుజిత్ డైరెక్ట్ చేస్తున్నాడు. దానయ్య డివివి భారీ బడ్జెట్ తో ఈ సినిమా చేస్తున్నారు. ఈ సినిమా కోసం పవర్ స్టార్ ఫ్యాన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్నారు. రీసెంట్ గా జరిగిన వీరమల్లు ఈవెంట్ లో కూడా ఓజీఓజీ అనే కేకలు వేశారు. అఖండ2 వస్తుందో లేదోఅన్నది తెలియ దు కానీ ఓజీ మాత్రం తప్పనిసరిగా సెప్టెంబర్ 25 వచ్చి తీరుతుంది. అఖండ 2 రిలీజ్ డేట్ పై కన్ ఫ్యూజన్ ఇంకా కొనసాగుతూనే ఉంది. బోయపాటి శ్రీను ఈ సినిమా మీద స్పెషల్ ఫోకస్ తో పనిచేస్తు న్నారని తెలుస్తుంది.

రిలీజ్ డేట్‌ముఖ్యం కాదుసినిమా ఆడియన్స్ ని అలరించేలా చేయడం ముఖ్యం. అందుకే అఖండ2 రిలీజ్ పై ఇంకా స్పష్టత తీసుకోలేదు. ఒకవేళ అఖండ 2 దసరా రేసు నుంచి తప్పుకుంటే మాత్రం పవర్ స్టార్ ఓజీకి కలిసి వచ్చినట్టే. ఐతే దసరాకి అఖండ 2 మిస్ అయితే తమిళ సినిమాలు ఏవైనా వచ్చే ఛాన్స్ ఉంది.

## ఆషికాను ఆపడం కష్టమే..!



వెండితెరపై వెలుగు రేఖలా తళుక్కున మెరిసే కథానాయికలు కొందరైతే, వెన్నెల ధారలా తెరపై నుంచి జారిపోయి ప్రేక్షకుల గుండె గదుల్లోకి చేరిపోయే కథానాయికలు మరికొందరు. అందం ఆకర్షణతో పాటు నాజూకుతనంతో ఆకట్టుకునే అలాంటి క థా నాయికల జాబితాలో ఆషికా రంగనాథ్ ఒకరుగా కనిపిస్తారు. ఆషికా అంటే ఆకాశం నుంచి జారిపోయిన అందాల చందమామ అనే విషయం ఆడియన్స్ కి తొలి సినిమాతోనే అర్థమైపోయింది. 'అమిగోస్' సినిమాతో తెలుగు తెరకి పరిచయమైన ఈ తమలపాకు లాంటి అమ్మాయి, ఆ తరువాత 'నా సామిరంగ' సినిమాతో భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాకి ఆమె గ్లామర్ ప్రత్యేకమైన ఆకర్షణగా నిలిచింది. దాంతో ఆ సినిమాకి వెళ్లిన వాళ్లంతా థియేటర్లలో తమ మనసులు పారేసుకునే బయటికి వచ్చారు. ఇక ఈ సుందరి ఇక్కడ వరుసబెట్టి సినిమాలు చేయడం ఖాయమని అనుకున్నారు .. కానీ అలా జరగలేదు. ఆషికా ఆచితూచి కథలను ఎంచుకోవడమే ఇందుకు కారణమని అనుకోవాలి. ప్రస్తుతం ఆమె తెలుగులో 'విశ్వంభర' తమిళంలో 'సర్దార్ 2' .. కన్నడలో 'గత వైభవ' సినిమాలతో బిజీగా ఉంది. ఈ కన్నడ సినిమా వచ్చేనెల 14వ తేదీన థియేటర్లకు రానుంది. ఇక 'సర్దార్ 2'.. 'విశ్వంభర' కూడా భారీ అంచనాలు ఉన్న ప్రాజెక్టులే. ఈ సినిమాలు హిట్ కొడితే ఇక ఆషికను ఆపడం కష్టమేననే టాక్ బలంగా వినిపిస్తోంది. సీనియర్ స్టార్ హీరోల సరసన ఆమె బిజీగా కావడం ఖాయమేనని అంటున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## పెద్ది ఫస్ట్ సింగిల్ ఆలస్యానికి కారణం ఏంటి..?




ఈ ఏడాది సంక్రాంతికి విడుదలైన 'గేమ్ ఛేంజర్' సినిమాతో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రేక్షకుల ముందుకు వచ్చి, ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయినప్పటికీ, ఇప్పుడు ఆయన పూర్తి స్థాయిలో తన కొత్త ప్రాజెక్ట్ 'పెద్ది'పై దృష్టి సారించారు. 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా, పాన్ ఇండియా లెవ ల్లో రూపొందుతోంది.

విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో నడిచే స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంపై ప్రారంభం నుంచి భారీ అంచనాలున్నాయి. ఈ అంచనాలకు తగ్గట్లుగానే మేకర్స్ ప్రతీ చిన్న అప్‌డేట్‌ను ఎంతో కేర్‌ఫుల్‌గా ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటివరకు విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ అన్నీ ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను రాబట్టాయి. ఇక ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నది ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్, ఆయన మ్యూజిక్ ఈ సినిమాకు స్పెషల్ ఎట్రాక్షన్ అని చెప్పడంలో సందేహమేలేదు. మేకర్స్ ఇప్పటికే ఈ విషయాన్నిస్పష్టంగా తెలియజే శారు. మూవీ నుండి విడుదల కానున్న ఫస్ట్ సింగిల్‌పై కూడా భారీ అంచనాలున్నాయి. దసరా సందర్భంగా ఈ పాటను రిలీజ్ చేస్తారని ఊహాగానాలు వెల్లువెత్తాయి. కానీ పాట విడుదల కాలేదు. తాజా సమాచారం ప్రకారం, పెద్ది ఫస్ట్ సింగిల్ పూర్తిగా రెడీగా ఉన్నప్పటికీ, దానికి సంబంధించిన కొన్ని విజువల్స్‌ను షూట్ చేసి, లిరికల్ వీడియోలో యాడ్ చేసిన తరువాతే విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నారట అందుకే పాట విడుదల చేయకుండా ఆ నిర్ణయాన్ని వాయిదా వేసినట్లు సమాచారం.

ఈ పాట ఒక మంచి లవ్ ట్రాక్ అని, రెహమాన్ దాన్ని ఎంతో ఫ్రెష్‌గా కంపోజ్ చేశారని యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తున్నదిగా ఇప్పటికే అధికారికంగా ప్రకటించగా,

జగపతిబాబు, శివరాజ్‌కుమార్ లాంటి సీనియర్ నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. అన్ని బలమైన అంశాలతో రూపొందు తున్న 'పెద్ది' సినిమా, 2026 మార్చి 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతున్న ఈ సినిమా, రామ్ చరణ్‌కు మరొక బ్లాక్‌బస్టర్‌ను తెచ్చిపెడుతుందా అన్నది ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## మల్టీప్లెక్స్‌ల హడావిడి...




ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో సినిమా లవర్స్‌కు శుభవార్త. దశాబ్దాలుగా సింగిల్ స్క్రీన్‌లకు కేంద్రమైన ఈ ప్రాంతంలో ఇప్పుడు రెండు అత్యాధునిక మల్టీప్లెక్స్‌లు రాబోతున్నాయి. ఓడియన్ మల్టీప్లెక్స్ (8 స్క్రీన్‌లు) అక్టోబర్ 24, 2025న.. ఆ తర్వాత సంక్రాంతి 2026కి ఏఎంబీ క్లాసిక్ (7 స్క్రీన్‌లు) ప్రారంభమవుతాయి. మహేష్ బాబు భాగస్వామ్యంతో వస్తున్న ఏఎంబీ క్లాసిక్, సుదర్శన్ థియేటర్ స్థానంలో రూపుదిద్దుకుంది. ఈ కొత్త మల్టీప్లెక్స్‌లతో ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ఇక 25 స్క్రీన్‌ల వినోద కేంద్రంగా మారుతుంది.మూవీ లవర్స్ కు ఇది శుభవార్త అనే చెప్పాలి. తెలుగు సినిమాకు ఎప్పుడూ గుండెకాయ లాంటి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ ప్రాంతం ఇప్పుడు కొత్తరూపు సంతరించుకుంటోంది. దశాబ్దాలుగా ఎన్నో బాక్సాఫీస్ రికార్డులకు వేదికైన ఈ ప్రాంతంలో.. మొన్నటి వరకు కేవలంపాత తరహా సింగిల్ స్క్రీన్ థియేటర్లు మాత్రమే ఉండేవి. కానీ.. ఇప్పుడు ఆ సంస్కృతి పూర్తిగా మారిపోతోంది. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఒకేసారి రెండు అత్యాధునిక మల్టీప్లెక్స్‌లు రాబోతున్నాయి.హైదరాబాద్‌లో సినిమా అంటే గుర్తొచ్చే సంధ్య, దేవి, సుదర్శన్ వంటి ఐకానిక్ థియేటర్లకు ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ చాలా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతంలో సుమారు 18 థియేటర్లు ఉండేవి. వీకెండ్‌లో కొత్త సినిమాల సందడితో ఈ ప్రాంతమంతా కిటకిటలాడేది. ఇప్పుడు ఆ పాత జ్ఞాపకాలకు మల్టీప్లెక్స్ మెరుగులు దిద్దుతున్నారు. 1. ఓడియన్ మల్టీప్లెక్స్ ప్రారంభం: ఒకప్పుడు ప్రసిద్ధి చెందిన ఓడియన్ సింగిల్ స్క్రీన్ థియేటర్ స్థానంలో.. ఇప్పుడు అత్యంత విలాసవంతమైన ఓడియన్ మల్టీప్లెక్స్ రూపుదిద్దుకుంది. ఇది అక్టోబర్ 24, 2025 న సినీ ప్రియుల కోసం తన తలుపులు తెరుస్తుంది. ఇందులో 8 స్క్రీన్‌లు ఉంటాయి. సినిమా చూసే అనుభవాన్ని పెంచడానికి అత్యాధునిక ప్రొజెక్షన్, సౌకర్యవంతమైన లగ్జరీ సీటింగ్‌ను ఏర్పాటు చేశారు. పార్కింగ్ ఇబ్బందులు లేకుండా మల్టీలెవల్ పార్కింగ్ సదుపాయం కల్పించారు. సినిమా హాల్‌తో పాటు, అందులోనే షాపింగ్ మాల్ కూడా ఉంది. దీంతో ప్రజలు ఒకేచోట సినిమాలు చూస్తూ, షాపింగ్ చేసుకునే అవకాశం లభిస్తుంది. 2. సంక్రాంతికి ఏఎంబీ క్లాసిక్: ఓడియన్ ప్రారంభమైన వెంటనే.. సంక్రాంతి 2026 సందర్భంగా మరో భారీ మల్టీప్లెక్స్ రాబోతోంది. అదే.. ఏఎంబీ క్లాసిక్. ఇది పాత సుదర్శన్ 70ఓఓ థియేటర్ ఉన్న చోట నిర్మిస్తున్నారు. సూపర్‌స్టార్ మహేష్ బాబుకు హైదరాబాద్‌లో ఇది రెండవ మల్టీప్లెక్స్ వెంచర్ కావడం విశేషం. ఏఎంబీ క్లాసిక్‌లో మొత్తం 7 స్క్రీన్‌లు ఉంటాయి. ఈ మల్టీప్లెక్స్‌లో విడుదల కానున్న మొట్టమొదటి పెద్ద సినిమా 'ది రాజా సాబ్' అయ్యే అవకాశం ఉంది. పీవీఆర్, ఐనాక్స్ వంటి పెద్ద కంపెనీల పోటీని ఏఎంబీ క్లాసిక్ ఎలా ఎదుర్కొంటుందో అని సినీ అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ రెండు మల్టీప్లెక్స్‌లు అందుబాటులోకి వస్తే.. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని స్క్రీన్‌ల సంఖ్య 18 నుంచి 25కు పెరుగుతుంది. అయితే.. ఈ ప్రాంతంలోని కొంతమంది విద్యార్థులు, కోచింగ్ సెంటర్ల నిర్వాహకు లు వీటి వల్ల ట్రాఫిక్ విపరీతంగా పెరిగే అవకాశం ఉందని.. ఇక్కడ భూమి ధరల పెరుగుదల వల్ల అద్దెలు ఎక్కువవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంమీద.. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని ఈ మార్పు సినీ పరిశ్రమకు, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇవ్వనుంది.

## మినీ స్కర్ట్‌లో అషు గ్లామర్



టాలీవుడ్ గ్లామర్ వరల్డ్‌లో అడుగుపెట్టిన తర్వాత అషు రెడ్డి స్టైల్, స్వాగ్‌కి ప్రత్యేకమైన ఫాలోయింగ్ ఏర్పడింది. బిగ్ బాస్ షోలో తన ఉత్సాహభరితమైన బాడీలాంగ్వేజ్‌తో అందరి దృష్టిని ఆకర్షించిన ఈ బ్యూటీ, తాజాగా తన గ్లామరస్ లుక్స్ తో మరోసారి నెట్టింట తెగ దూసుకుపోతోంది. షేర్ చేసిన ఫోటోషూట్‌లో అషు రెడ్డి రెడ్ కలర్ ఫ్లోరల్ టాప్, బ్లాక్ మినీ స్కర్ట్‌లో స్టన్నింగ్‌గా మెరిసిపోయింది. ఈ లుక్‌లో ఆమె వేషధారణ మాత్రమే కాదు, హైహీల్స్, హెయిర్ ఫ్లిప్, ఎక్స్‌ప్రెషన్లు అన్నీ కలసి ఒక స్టైలిష్ స్టేట్మెంట్ లా మారాయి.

"నా హీల్స్ నిన్ను ఎత్తుగా చేస్తాయని నాకు తెలుసు. అనే క్యాప్షన్‌తో ఆమె పోస్ట్‌కి యూత్ నుంచి రెస్పాన్స్ జెట్ స్పీడ్‌లో వచ్చింది. వేలల్లో లైకులు, ఆకట్టుకునే కామెంట్లతో ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈ లుక్ చూస్తే క్లాస్‌కు గ్లామర్ ఎలా జోడించాలో అషుతో నేర్చుకోవాలి అంటున్నారు నెటిజన్స్. ఇక అషు కెరీర్ విషయానికొస్తే, సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిన ఈ బ్యూటీ, డబ్‌స్మాష్‌తో మొదలైన ప్రయాణం టీవీ నుంచి సినిమాల వరకు విస్తరించింది.

Published & Owned by Mamidi Somaiah, H.No.3- 2-92/27 to 276/506, Rock Town Colony, LB Nagar, Hyd, Rangareddy, Telangana- 500068. Printed at Ellora Printers, LN Nagar, Industrial Estate, Uppal, Rangareddy, Telangana. Editor- Mamidi Somaiah. Ph No. 9 00933723. RNI No. TEL TEL . 12/48343